Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 30.03.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 43 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## విజయభారత్



జిఎస్ఎల్వి-ఎఫ్08 సక్సెస్

3లో

### హోదా ఉద్యమం..

# హైజాక్‌కు బ్రేక్



- అఖిలపక్షం పేరుతో కొత్త నాటకం
- తిప్పికొట్టిన ప్రతిపక్షం
- ఎత్తి పొడిచిన వామపక్షం

రామయ్య ఇంట కొడుకు పెళ్ళి జరుగుతుంది. పెళ్ళి పనులన్నీ తన స్నేహితులైన చంద్రయ్య, రాజయ్యలకు అప్పగించాడు. చంద్రయ్యకు పని కంటే కూడా మాటలెక్కువ. రాజయ్యకు మాటలకంటే పని మీద ధ్యాస ఎక్కువ. పెళ్ళి ఏర్పాట్లన్నీ రాజయ్య దగ్గరుండి చూసుకుంటున్నాడు. చంద్రయ్య మాత్రం నలుగురిని పోగేసుకుని తాను అంతటివాడినని ఇంతటి వాడినని డబ్బా కొట్టుకునే వాడు. పెళ్ళి పనులు చివరి దశలో వుండగా, అక్కడకు రామయ్య రావడాన్ని చంద్రయ్య చూసాడు. వెంటనే మాటలు కట్టేసి పెళ్ళి పనుల వద్దకు పరుగెత్తి అక్కడున్న టెంకాయ మట్టలను గుంజలకు కడుతూ నుదుటన చెమటను తుడుచుకుంటున్నట్లు ఫోజివ్వసాగాడు. పని అయ్యేదాకా కష్టపడింది రాజయ్య... చివరి దశలో పనిలో అడుగు పెట్టి... నేను పని చేయడం వల్లే అన్ని పనులు పూర్తయ్యాయి అన్నట్లు కలరింగ్ ఇవ్వాలనుకున్నాడు చంద్రయ్య. కాని, రాజయ్య, చంద్రయ్యలలో ఎవరి బుద్ధి ఏమిటో తెలిసిన వాడు రామయ్య.

ఇప్పుడు రామయ్య లాంటివారే ఆంధ్రా ప్రజలు. ప్రత్యేకహోదా కోసం చిత్త శుద్ధితో నాలుగేళ్ళ నుండి పోరాటం చేస్తున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని నమ్ముతారా? లేక నాలుగేళ్ళ నుండి ప్యాకేజీ పాట పాడుతూ నాలుగురోజుల క్రితమే హోదా మాట మార్చిన చంద్రబాబును విశ్వసిస్తారా? అన్నదే చూడాలి!

(మిగతా 11వ పేజీలో)

## ఆనం పెత్తనంకు తెర

• సుప్రీంలో చుక్కెదురు

2లో






• రాజకీయ రొచ్చు

# కలవర పెట్టిన కరచాలనం

› పచ్చ మీడియా రచ్చ

మనం భారతదేశంలో వున్నామా? పాకిస్తాన్‌లో వున్నామా? నరేంద్ర మోడీ మన దేశానికి ప్రధాన మంత్రా? పాకిస్థాన్ ప్రధాన మంత్రా? ఆయనేమన్నా భారతీయులకు ఆగర్భశత్రువా? మన దేశాన్ని దోచుకోవడానికి వచ్చిన గజనీమహ్మద్ లాంటివాడా? మన దేశంలో బాంబులు పేల్చిన దావూద్ ఇబ్రహీం, కసబ్ లాంటి ఉగ్రవాదా? ఒక రాజ్యసభ సభ్యుడు ఆయనకు నమస్కారం చేస్తే తప్పవుతుందా?

(మిగతా 11వ పేజీలో)



# ఆనం పెత్తనంకు తెర




వి.ఆర్ విద్యాసంస్థలు... ఒకప్పుడు వెంకటగిరి రాజా విద్యాసంస్థలు అని పేరు. గత మూడు దశాబ్దాలుగా వివేకానందరెడ్డి విద్యాసంస్థలుగా పేరుబడ్డాయి. ఈ విద్యాసంస్థలు ఆనం కుటుంబం చేతుల్లోకి వచ్చాక వెంకటగిరి రాజాల పేరు మరుగునపడిపోయింది. వాళ్ళ పేరు సంబంధిత విద్యాసంస్థల డాక్యుమెంట్లలో తప్పితే ఎక్కడా కనిపించేది కాదు. విద్యాసంస్థలపై మొత్తం పెత్తనం ఆనందే అయ్యింది. కరస్పాండెంట్లు వాళ్ళే, కోశాధికారులు వాళ్ళ మనుషులే. విఆర్ విద్యాసంస్థలను దాదాపు మూడు దశాబ్దాలకు పైగా తమ గుప్పిట్లో పెట్టుకుని నడిపించారు. అయితే ఇన్నేళ్ళ పాటూ విఆర్ విద్యాసంస్థలు వారి చేతుల్లో అక్రమంగానే వున్నాయనే విషయం నిన్నటి సుప్రీం కోర్టు తీర్పుతో వెల్లడైంది. 1986లో జరిగిన ఎన్నికల ద్వారా ఎన్నికైన పాలకవర్గం ఎన్నిక చెల్లదంటూ 27వ తేదీన సుప్రీం కోర్టు తుది తీర్పు వెలువరించింది. ఇదే ఫైనల్ తీర్పు కావడంతో విఆర్ విద్యాసంస్థలపై ఆనం ప్రాభవానికి తెరదించినట్లయ్యింది. ఈ ఏడాది జులై లోపు కొత్త కమిటీని ఎన్నుకోవాలని కూడా సుప్రీం కోర్టు సూచించింది.

హిందూ మత ప్రాధాన్యతతో వెంకటగిరి రాజాలు 1875లో విఆర్ విద్యాసంస్థలను ప్రారంభించారు. ఇవి అంచెలంచెలుగా విస్తరిస్తూ వచ్చాయి. 1940 నుండి విఆర్ విద్యాసంస్థల పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించసాగారు. విఆర్ విద్యాసంస్థల కమిటీకి 1950, 1960, 1970 లలో ఎన్నికలు జరిగాయి. 1970లో ప్యాట్రన్‌గా వున్న పెద్ద రాజా యాచేంద్ర చనిపోయారు. అప్పుడు అధ్యక్షుడిగా వున్న కుమార రాజాను ప్యాట్రిన్‌గా, ఆనం వెంకటరెడ్డిని కొత్త అధ్యక్షుడిగా కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. ప్రతి ఐదేళ్ళకోసారి నిర్వహించాల్సిన ఎన్నికలను జరపకుండా ఆనం వాళ్ళు కాలాన్ని నెట్టుకు రాసాగారు.

1985లో విఆర్ విద్యాసంస్థల పాలకవర్గానికి ఎన్నికలు జరపాలంటూ ఏబివిపి నాయకులైన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆమంచర్ల శంకరనారాయణ, నందిమండలం చంద్రశేఖర్‌రాజులు నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి ఎన్టీఆర్ దాకా వెళ్లడంతో ఆయన స్పందించారు. నెల్లూరొచ్చి విఆర్ పాలకవర్గానికి ఎన్నికలు జరిపిస్తానని హామీ ఇచ్చి వీరిచేత దీక్షను విరమింపజేసారు. వీళ్ళు ఎన్నికలనైతే పెట్టించగలిగారు గాని ఆనం వాళ్ళు ఇంకో రూట్లో వెళ్ళి వీరి ప్రయత్నాలకు గండికొట్టారు. అప్పటి వరకు కమిటీలో సభ్యులుగా మెజార్టీవాళ్ళు ఆనంకే మద్దతుగా వుండడంతో బైలాను సవరించారు. పూర్వవిద్యార్థులకు ఓట్లు లేకుండా చేసి 1986లో ఎన్నికలు నిర్వహించారు. అయితే పూర్వవిద్యార్థులు దీనిపై నెల్లూరు సివిల్ కోర్టులో కేసు వేయడంతో ఫలితాలు వెల్లడించలేదు. 1993లో పూర్వవిద్యార్థులకు వ్యతిరేకంగా తీర్పు వెలువడింది. దీంతో 1986లో జరిగిన ఎన్నికలకు సంబంధించి 1993లో ఫలితాలను వెల్లడించారు. ఆ ఫలితాల ద్వారా ఆనం వివేకానందరెడ్డి కరస్పాండెంట్‌గా భారీ మెజార్టీతో గెలిచాడు. పూర్వవిద్యార్థుల ఓట్లు వుంటే ఫలితం ఇంకో విధంగా ఉండేదేమో! ఆనంవాళ్ళు దీనిని గ్రహించే పూర్వవిద్యార్థులకు ఓట్లు లేకుండా చేసారు.

అయితే పూర్వవిద్యార్థులైన ఆమంచర్ల శంకరనారాయణ, గూడూరు విజయరామిరెడ్డి, పోతుల రమణయ్యలు నెల్లూరు సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై 1996లో హైకోర్టును ఆశ్రయించారు. దాదాపు 15ఏళ్ళ తర్వాత ఈ కేసు 2015లో విచారణకొచ్చింది. ఆడిటర్ ఆమంచర్ల శంకరనారాయణ పట్టు వదలని విక్రమార్కుడిలా ఈ కేసు గురించి పోరాడాడు. వాదోపవాదనల తర్వాత 2017 మార్చి 6వ తేదీన ఆనం వివేకానందరెడ్డి కరస్పాండెంట్‌గా కొనసాగుతున్న పాలకవర్గం చెల్లదని హైకోర్టు తీర్పునిచ్చింది. వెంటనే విఆర్ విద్యాసంస్థలకు ప్రత్యేక అధికారిని నియమించాలని కూడా ఆదేశించింది. ఈ తీర్పును పునఃపరిశీలించాలని ఆనం వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. దీంతో చివరి ప్రయత్నంగా ఆనం సోదరులు సుప్రీంకోర్టుకు వెళ్ళారు. కేసు పూర్వాపరాలను పూర్తిగా పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం ఆనంకు వ్యతిరేకంగానే తీర్పునిచ్చింది. అంటే ఈ తీర్పు ప్రకారం 1993 నుండి ఇప్పటివరకు దాదాపు 35ఏళ్ళ పాటు చట్టవిరుద్ధంగానే విఆర్ విద్యాసంస్థలపై ఆనం వాళ్ళు పెత్తనం చెలాయించారన్నది అర్థమవుతుంది. విఆర్ విద్యాసంస్థల చరిత్రలో వెలుగు, చీకట్లు అన్నీ కూడా ఈ 35ఏళ్ల లోనే జరిగిపోయాయి. విఆర్ విద్యాసంస్థలలో సీటు దొరకడం గగనం అనే పరిస్థితి నుండి, అసలు సీట్లే భర్తీకాని నేటి పరిస్థితి వరకు ఎన్నో మలుపులు చూసాం. విఆర్ ప్రాథమిక పాఠశాల నుండి హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, న్యాయకళాశాల, విఆర్ ఐఏఎస్, విఆర్ ఐపిఎస్, విఆర్ బి.ఇడి... ఇలా అన్ని దశలనూ చూసాం. హిందూ విద్యాసంస్థలుగా నెలకొల్పబడ్డ విఆర్ విద్యాసంస్థల ముందు అన్యమత విగ్రహాలు నెలకొల్పడం చూసాం. విఆర్ విద్యాసంస్థలు విద్యారంగంలో వెలిగిపోవడం కాని, కాలక్రమేణా గత వైభవాన్ని కోల్పోవడం కాని... అంతా ఈ మూడున్నర దశాబ్దాల కాలంలోనే జరిగింది.

ఆనం బ్రదర్స్ రాజకీయాలకు ఎంత ప్రాధాన్యతనిచ్చారో, ఈ విద్యాసంస్థలపై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి కూడా అంతే ప్రాధాన్యతనిచ్చారు. కేవలం విద్యాసంస్థలను తమ చేజారకుండా కాపాడుకోవడం కోసమే తెలుగుదేశంలో చేరారు. ఆఖరకు మంత్రి నారాయణను సైతం ప్రసన్నం చేసుకునే పరిస్థితికొచ్చారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం వున్నంత వరకు విఆర్ విద్యాసంస్థల వ్యవహారాలలో ఎవరు కూడా వేలుపెట్టడానికి సాహసించే వాళ్ళు కాదు. కాని తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక మంత్రి నారాయణ విఆర్ విద్యాసంస్థల కార్యకలాపాలలో తల దూర్చినా, ఆనంవాళ్ళు ఆయనను నిలువరించలేకపోయారు. విఆర్‌ను చేజారకుండా చూడడానికి వాళ్ళు ఎంతగా పాకులాడినా... సుప్రీం కోర్టు తీర్పుతో ఆ ప్రయత్నాలన్నీ వృధాగానే మిగిలిపోయాయి.



# విజయభారత్



## • జిఎస్ఎల్‌వి-ఎఫ్08 సక్సెస్



*భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)కు కొరుకుడుపడని కొయ్యగా మారి పలు సందర్భాల్లో మొండికేసి ఇబ్బంది పెట్టిన జిఎస్ఎల్‌వి మెడలను ఆ సంస్థ ఎట్టకేలకు వంచింది. క్రమంగా దారి తప్పుతున్న జిఎస్ఎల్‌వి సిరీస్‌ను ఒక దారిలో పెట్టింది. ఇస్రోకు పిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి రెండూ ముద్దుబిడ్డలే! కాకపోతే పీఎస్ఎల్‌వి ముందుగానే దారిలో పడి 'ఇస్రో' చెప్పినట్లు క్రమశిక్షణతో నడుచుకుంటుంది. జిఎస్ఎల్‌వి మాత్రం అప్పుడప్పుడూ మొండికేస్తుండేది. అలాంటి మొండిఘటాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు ఎట్టకేలకు దారికి తెచ్చారు. అంతరిక్ష ప్రయోగాల పరంపరలో మరో మైలురాయిని అధిగమించారు. జిఎస్ఎల్‌వి ప్రయోగాలలో మరో విజయాన్ని నమోదు చేశారు.*

మార్చి 29వ తేదీ సాయంత్రం 4.56గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించిన జిఎస్ఎల్‌వి-ఎఫ్08 విజయవంతమైంది. ఈ ప్రయోగం ద్వారా 2,140 కిలోల బరువుగల జీశాట్-6ఏ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇది పూర్తి స్వదేశీ ఉపగ్రహం. దేశీయ మొబైల్ కమ్యూనికేషన్ వ్యవస్థకు మల్టీబీమ్ ప్రసారాలను ఇది అందించనుంది. మొబైల్ బ్రాడ్‌బాండ్ సేవలకు ఎస్ బాండ్ బీమ్‌లు ఉపయోగపడనున్నాయి. ఈ ఉపగ్రహం తయారీకి దాదాపు 210 కోట్లు ఖర్చయ్యింది. పదేళ్ళ పాటు ఇది తన సేవలను అందించనుంది. మొత్తం 17.46 నిముషాలలో ప్రయోగం పూర్తయ్యింది. ప్రయోగం విజయవంతం కాగానే ఇస్రో ఛైర్మెన్ శివన్‌తో పాటు షార్ శాస్త్రవేత్తలు ఒకరినొకరు కౌగిలించుకుని అభినందనలు తెలుపుకున్నారు. జిఎస్ఎల్‌వి సిరీస్‌లో ఇది 12వ ప్రయోగం. భారీ ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టడానికి జిఎస్ఎల్‌వి సిరీస్ ఉపయోగపడుతుంది. 2001 నుండి 2010దాకా రష్యా క్రయోజనిక్ ఇంజన్‌లతో ఆరుసార్లు జిఎస్ఎల్‌వి ప్రయోగాలు చేసారు. వాటిలో రెండు మాత్రమే విజయవంతమయ్యాయి. 2010లో రష్యా క్రయోజనిక్ ఇంజన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు అందించడం నిలిపేసింది. దీంతో ఇస్రోనే సొంతంగా క్రయోజనిక్ టెక్నాలజీని రూపొందించుకుంది. ఇంతవరకు సొంత టెక్నాలజీతో 5ప్రయోగాలు జరుపగా మొదటిది తప్ప మిగతా నాలుగు విజయవంతమయ్యాయి. ఇప్పుడు ఆరవ ప్రయోగం కూడా విజయవంతం కావడంతో జిఎస్ఎల్‌వి సిరీస్‌పై నమ్మకం మరింత పెరిగింది.

### వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా...

# పేర్నాటి శ్యామ్

**• శ్రమకు తగ్గ గుర్తింపు**



*వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి రాజకీయ వాతావరణంలో కావాల్సింది ఎవరు? పోటీ చేసే నాయకులా? పనిచేసే సేవకులా? పార్టీ కోసం ఎంతటికైనా తెగించి పోరాడే యువకులా? పోటీ చేసే నాయకులు దొరుకుతారు. పనిచేసే సేవకులూ, పార్టీ కోసం తెగించి పోరాడే యువకులూ అరుదుగా వుంటారు. అలాంటి వారిలో ఒకడే పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి. దీనికంటే కూడా అల్లంపాడు శ్యామ్‌గా జిల్లా వాసులందరికీ సుపరిచితుడు.*

గూడూరు డివిజన్‌లో వైయస్సార్ కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీని ప్రజల ముంగిళ్ళకు తీసుకెళ్ళడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డిని ఇప్పుడు వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. వై.యస్.ఆర్.సి.పిలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని సూచించడమే శ్యామ్‌కు పార్టీ ఇచ్చిన ఈ పదవి.



జన నాయకుడు వై.యస్.జగన్‌తో...

కోట మండలం అల్లంపాడు గ్రామానికి చెందిన శ్యాంప్రసాద్‌రెడ్డి 2011 జూన్ నెలలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పూర్తి సమయాన్ని పార్టీ సేవకు వినియోగించారు. జగన్ బాటలో నడిచారు. జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యునిగా పని చేశారు. పేర్నాటి శ్యాం విద్యార్థి దశ నుండే రాజకీయాల్లో వున్నారు. వారి తండ్రి చెంచురామరెడ్డి 1972 నుండి 1994 వరకు స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యఅనుచరుడిగా వుంటూ కాంగ్రెస్‌పార్టీలో కీలకంగా పని చేసారు. శ్యాం చిన్నాన్న పేర్నాటి రంగారెడ్డి బీజేపీ పార్టీ నాయకుడిగా గూడూరు ప్రాంతంలో సుపరిచితుడే! విద్యార్థి దశలో ఏబివిపి మద్దతుదారుడిగా వున్న శ్యాం 1996లో తన చిన్నాన స్ఫూర్తితో బీజేపీలో చేరారు. 2006 సంవత్సరంలో సిద్ధవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా విజయం సాధించాడు. జిల్లాలో బీజేపీ గెలిచిన తొలి సహకార సమితి ఇదే! రాజకీయాలలోనే కాక సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనవంతు బాధ్యతలు నిర్వహించడానికి 2017లో 'పేర్నాటి ఛారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించి ఆ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించడం, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, స్వచ్ఛభారత్, చెట్ల పెంపకం, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. పదో తరగతిలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో మంచి మార్కులు తెచ్చుకున్న పేదవిద్యార్థులకు పైచదువుల కోసం తమవంతు ఆర్థిక సహకారం అందిస్తున్నాడు. వైద్యశిబిరాల ద్వారా కంటి రుగ్మతలు వున్నవారిని గుర్తించి దాదాపు 1400మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించాడు. ఇటు రాజకీయంగా, అటు సామాజిక సేవాపరంగా ప్రజలకు తనవంతు సేవలందించాలనుకుంటున్న నాయకుడు శ్యామ్. చురుగ్గా పనిచేసే కార్యకర్తను గుర్తించి సముచిత పదవి... అంతకంటే కూడా బాధ్యత అప్పగించి



జిల్లా ఇన్‌ఛార్జ్ సజ్జల రామకృష్ణారెడ్డితో...

మంచి పని చేశాడు జగన్. పార్టీలో పదవులే ముఖ్యం కాదు. తాను ఎమ్మెల్యేనో ఎంపీనో కావాలనుకోవడం కన్నా తన పార్టీ గెలవాలి, తమ నాయకుడు ముఖ్యమంత్రి కావాలి అని అనుకున్నవాడే నిజమైన అభిమాని. అలాంటి అభిమానుల్లో ఒకడే శ్యాం. ఇటీవల గూడూరులో జరిగిన వై.యస్.జగన్ పాదయాత్రలో తన సత్తా చూపించి పార్టీలో రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి ఇలాంటి నిస్వార్థ నాయకత్వం ప్రతి చోటా అవసరం.

### ప్రత్యేకహోదా పోరులో...

# నెల్లూరులో భారీ బైక్ ర్యాలీ




ఉద్యమాలను వెరైటీగా చేయడంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్పెషలిస్టు లీడర్. గతంలో 'జై సమైక్యాంధ్ర' ఉద్యమం కూడా ఆ విధంగా చేసిన చరిత్ర ఉందాయనకి. కాగా, మార్చి 29వ తేదీన ప్రత్యేకహోదా పోరులో భాగంగా నెల్లూరులో దాదాపు 2,500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించి తన సత్తా చాటాడు. ఆరోజు సాయంత్రం స్టోన్‌హౌస్‌పేటలోని జలకన్య బొమ్మ నుండి ప్రారంభమైన ర్యాలీ, ఆత్మకూరు బస్టాండ్, కనకమహల్, గాంధీబొమ్మ, విఆర్‌సి, నెహ్రూ బొమ్మల మీదుగా పెద్దబజార్, చిన్నబజార్‌ల గుండా సాగి నర్తకి సెంటర్‌లోని ఎన్‌టిఆర్ బొమ్మ వద్దకు చేరింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి పి.నారాయణతో పాటు మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్లీడర్‌గా రఘునాథరెడ్డి



నెల్లూరుకు చెందిన సీనియర్ న్యాయవాది కనుమూరు రఘునాథరెడ్డిని ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తూ కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ రేవు ముత్యాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. 2018 నుండి 2021 వరకు ఆయనను ప్రభుత్వ ప్లీడర్‌గా నియమించారు. నెల్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో, అదనపు డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులో ఆయన ఈ మూడేళ్ళు ప్రభుత్వ ప్లీడర్‌గా సేవలందిస్తారు. గతంలోనూ ఆయన 2014-2017 మధ్య ప్రభుత్వ ప్లీడర్‌గా సేవలందించారు. టి.పి.గూడూరు మండలం పోట్లపూడి గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి కుటుంబం ఎన్నో ఏళ్ళ క్రితమే నెల్లూరులో స్థిరపడింది. రఘునాథరెడ్డి తండ్రి శంకర్‌రెడ్డి కూడా జిల్లాలో పేరుమోసిన న్యాయవాది. ఆయన అడుగుజాడల్లోనే నడిచి రఘునాథరెడ్డి కూడా మంచి లాయర్‌గా గుర్తింపు పొందారు. ప్రభుత్వ ప్లీడర్‌గా సేవలందించనున్న రఘునాథరెడ్డికి 'లాయర్' అభినందనలు.

స్వర్గీయ సన్నపరెడ్డి వెంకటరెడ్డి గారు

Since : 1958
60 YEARS ANNIVERSARY CELEBRATIONS



శ్రీ సన్నపరెడ్డి కృష్ణారెడ్డి గారు

సిటీ మెడికల్ ఏజన్సీస్
కె.ఏ.సి.ప్లాజా, ఆర్.ఆర్.స్ట్రీట్, నెల్లూరు.

1958లో ప్రారంభమైన సిటీ మెడికల్స్ ప్రస్థానం
ఖాతాదారులకు నిబద్ధత, నమ్మకాలకు ప్రతిరూపమై విశిష్ట సేవలందిస్తూ
60వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభవేళ మా సన్నిహితులు
శ్రీ సన్నపరెడ్డి కృష్ణారెడ్డి గారికి హృదయపూర్వక శుభాకాంక్షలతో...

| | | |
|---|---|---|
| Manager & Staff<br>KVB Karur Vysya Bank, Smart way to bank<br>Nellore | S.ROHIT REDDY M.S.<br>Newyork University<br>New York. | D. DEEPAK M.S(USA)<br>ABHINAYA<br>Bangalore |
| Manager & Staff<br>SOUTH INDIAN Bank<br>Nellore | NELLORE MEDICALS<br>Trunk Road, Nellore | Viswanadha Sarma<br>Sumages Pvt.Ltd,<br>Hyderabad |
| MEDICAL REPRESENTATIVES | INDOCO Remedies Ltd | WALLACE Pharmaceuticals |
| Cadila Health Care | NOVARTIS INDIA Ltd | ALCON NOVARTIS<br>Ophthalmic Division |
| FARANCO INDIAN Ltd | Abbot Health Care Pvt Ltd | ZYDUS Health Care Ltd |
| PFIZER Ltd<br>Professional Sales Officers | Anglo French Drugs & Industries | EMCURE Pharmaceuticals Ltd |
| Sun Pharmaceuticals Ltd | Mark India Ltd | Dr.Reddys Laboratories Ltd |
| Allergan India Ltd | MSD Pharmaceuticals | Biological E Limited |
| WOCKHARDT GROUP | TORRENT Pharmaceuticals Pvt Ltd | Bayer Zydus Pharma |

## 'ప్రభా'తం

మానవాళికి ప్రాణాధారమైన జలాలు నానాటికీ అడుగంటిపోతున్నాయి. గుక్క తడుపుకోవడానికి గుక్కెడు నీరు దొరక్క అనేక ప్రాంతాల్లో జనం అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితి ఈనాటిదేమీ కాదు. ఏళ్ళ తరబడి వెంటాడుతూ ఉన్నదే. అయినా, ప్రభుత్వాలు కానీ, పాలకులు కానీ ఈ దుస్థితిని మార్చలేకపోతున్నారు. ప్రతినీటి చుక్కను కాపాడుకుందామనే బరువైన నినాదాలు ఇస్తుంటారే తప్ప ప్రజల దాహార్తి తీర్చే అమృతం లాంటి జలాలను శాశ్వత ప్రాతిపదికపైన పరిరక్షించుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో, జలం పాటికి జలం కాలక్రమేణా అడుగంటిపోతూనే ఉంది. జనం పాటికి జనం యధారీతిగా దాహమో! రామచంద్రా అంటూ విలవిల్లాడిపోతూనే ఉన్నారు.

ఒక్క మానవులకే కాదు, పశుపక్ష్యాదులకు, చెట్టు చేమలకు అన్నిటికీ నీరే జీవనాధారం..ప్రాణాధారం. నీరు లేకుండా ప్రాణం నిలబడదు. గుక్క తడుపుకోకుండా దేహం బతకదు. అందరికీ ప్రాణాలు నిలబట్టే ఆ నీటిని మాత్రం మానవుడు తన అవసరాలకు తగ్గట్టుగా సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తరాలకు నీటి కొరత లేకుండా చూడాల్సిన పవిత్రమైన కర్తవ్యాన్ని మాత్రం విస్మరిస్తున్నాడు. అటు సాగునీటి జలాలు, ఇటు తాగునీరు అందరికీ ఎంతో అవసరమైనప్పటికీ, దేశంలో ఇంకా అనేక ప్రాంతాల్లో నిత్యం నీటికి కటకటలు పడుతూనే ఉన్నారు. మనదేశంలో కనీసం 84 కోట్ల మందికి పైగానే ప్రజలు తాగేందుకు చుక్క నీరు దొరక్క దుర్భర పరిస్థితుల్లో ఉన్నారంటూ గణాంకాలు చెప్తున్నాయి. రానురాను ఈ నీటికరువు మరింతగా కోరలు చాస్తుందని, దేశంలో సగభాగానికి పైగానే ప్రజలకు జలగండం తప్పదని నిపుణులు అంచనాలు వేస్తున్నారు. అయినా, ప్రభుత్వాల్లో కదలిక ఉండడం లేదు. వేసవి వస్తే చాలు..అనేక ప్రాంతాల్లో ప్రజలకు నీటి బాధలు మరింత వెక్కిళ్ళు పెట్టిస్తుంటాయి. కుండలు బిందెలు చేతపట్టుకుని ఎంతో మంది తల్లులు, గృహిణులు ఇంటిపనులు వదిలిపెట్టుకుని, మైళ్ళ దూరంలో ఉన్న ఏ పంటపొలాల్లోనో ఉన్న వ్యవసాయబావుల వద్దకు వెళ్ళి నీళ్ళు తెచ్చుకోవాల్సిన దుస్థితి. ఆ తెచ్చుకునే బిందెడు నీరు వంటకే చాలదు..ఇక తాగేందుకు మళ్ళీ కుండ చేత పట్టుకుని బావుల వద్దకు వెళ్ళాలి. అవి కూడా దొరక్క ఎక్కడెక్కడ నీటి వనరులున్నాయో వెదుక్కుంటూ ఏ గుంటల్లోనో, నీటి చెలమల్లోనూ నీళ్ళు తోడుకుని వచ్చి, ఆ మురికినీటినే వడకట్టుకుని తాగి ప్రాణం నిలబెట్టుకునే ప్రజలు కోట్లాదిగానే ఉంటారంటే అతిశయోక్తి కాదు. ప్రజలందరికీ సురక్షిత మంచినీరు అందించాల్సిన పాలకులు ప్రజల దాహార్తి తీర్చేందుకు, గ్రామాల్లో ఉన్న నీటి సమస్యలను పరిష్కరించేందుకు ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎందరు పాలకులు మారినా ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడమే బాధాకరం. అందువల్లనే నేటికీ దేశంలోని ఎన్నో ప్రాంతాల్లోని జనం తమ పంటలు ఎండిపోతున్నాయంటూ అన్నదాతలు, గొంతులు తడారిపోతున్నాయంటూ ప్రజలు తల్లడిల్లిపోతూనే ఉన్నారు. బోర్లెండిపోతూనే ఉంటాయి.. నోర్లెండి పోతూనే ఉంటాయి. కాకి అరుస్తూనే ఉంటుంది..కరవాడ ఎండుతూనే ఉంటుంది.. అయినా, పట్టించుకునే నాధులెవరు?.. జనానికి ఈ మండే ఎండల్లో ఉండే బాధలు చాలవన్నట్లు వేసవిలో నీటి కష్టాలు చెప్పుకుంటూ పోతే కడివెడు కన్నీటి కథలే అవుతాయి. అందులోనూ, నీటిలో కలుషిత నీరు వేరయా అన్నట్లు.. అంతటా కాలుష్యం ప్రబలిపోతున్న ఈ రోజుల్లో నీరు కూడా కాలుష్యపు కాటుకు గురవుతూనే ఉంది. నదులు, కాలువలు, చెరువులు, దొరువులన్నీ రకరకాల వ్యర్థాలతో భరించలేనంత కాలుష్యానికి గురై, ఆ నీరు తాగిన ప్రజలు నానా రకాల వ్యాధులతో అవస్తలు పడుతూనే ఉన్నారు. నీటి వనరులను పరిరక్షించుకోవడానికి, కాలుష్యభూతాన్ని తరిమికొట్టడానికి ప్రభుత్వాలు తగు శ్రద్ధ తీసుకోవడం లేదు. దేశంలో సుమారు 450కి పైగానే నదీనదాలున్నా, ఇటీవలి కాలంలో కాలుష్యానికి గురైన నదుల సంఖ్య 275కి పైగానే పెరిగిందని కేంద్ర కాలుష్య నివారణ మండలి చెప్తున్నా పాలకులకు అది శ్రవణపేయంగానే ఉంటోందే తప్ప, ఆ కఠోర వాస్తవాల్ని జీర్ణించుకునే స్థితిలో ఉండడం లేదు. దీంతో, దేశంలోని అనేక ప్రాంతాలు కలుషిత నీటితో కుళ్ళిపోతున్నాయి. ఈ నీటిని తాగి ఏటా ప్రాణాలు పోగొట్టుకునేవారి సంఖ్య గణనీయంగానే ఉంది. ఈ ఇక్కట్లు చాలవన్నట్లు, మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లుగా, నీటిలో ఫ్లోరైడ్ శాతం కలవడం ద్వారా ఆ నీరు అనేకమంది ప్రజలను మరింతగా బాధిస్తోంది. విధిలేని పరిస్థితుల్లో మరో ప్రత్యామ్నాయం లేక ఫ్లోరైడ్ శాతం కలగలసిన నీటిని తాగాల్సి రావడంవల్ల దేశంలోని అనేక ప్రాంతాల్లోని ప్రజలు అనేకానేక వ్యాధులకు బాధలకు గురై శాపగ్రస్తుల్లా, జీవితాంతం జీవచ్చవాల్లా బతుకుతున్నారు. వారిని కదిలిస్తే చాలు.. కన్నీళ్ళే జలజలా రాలుతాయి. అయినా, వారి ఆర్తిని.. దాహార్తిని తీర్చేవారెవరు?.. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఫ్లోరైడ్ రక్కసి ఇంకా ఇంకా విరుచుకుపడుతూనే ఉందని నిపుణులు ఎన్నిసార్లు ఎంత స్పష్టంగా హెచ్చరిస్తున్నా పాలకుల చెవికెక్కకపోవడం ఎంతైనా విచారకరం. మనకు లభించే నీటి వనరులు కాలుష్యంతో ఉంటున్నాయి. భూగర్భంలో ఉండే స్వచ్ఛమైన జల వనరులు అడుగంటిపోతున్నాయి. ఈ పరిస్థితిని అందరూ వెంటనే గ్రహించాలి.

ప్రభుత్వాలు, పాలకులు, మేధావులు అందరూ కలిసి ఇకనైనా నీటిని సంరక్షించుకునేందుకు బృహత్తర ప్రయత్నాలు చేయాలి. వాననీటిని పొదుపుగా వాడుకోవాలి. వాననీటిని భూమిలోకి ఇంకిపోయేలా చేయడం ద్వారా భూగర్భజల వనరుల్ని రక్షించుకోవాలి. అడవులు, చెట్టుచేమలు పెంచడం ద్వారా వర్షపాత సాంద్రతను పెంచుకోవాలి. వానలు.. వరదల ద్వారా సముద్రాలకు వృధాగా వెళ్లిపోతున్న అపార జలరాశిని కాపాడుకోవాలి. ఈ బాధ్యతలు విస్మరిస్తే జీవితాలు చివరికి ఎండిన మోడులే అవుతాయి. జలం ఉంటేనే జాతికి బలం. ఆ జలమే అందరికీ శ్రీరామరక్ష.. కనుక ఆ జీవజలాన్ని కాపాడుకోవాలి. పచ్చదనాన్ని, పర్యావరణాన్నీ పరిరక్షించుకోవాలి. అదే మనందరి తక్షణ కర్తవ్యం!....

### అడుగంటుతున్న జలం... అల్లాడుతున్న జనం!



మనకు లభించే అధికశాతం నీటి వనరులు కాలుష్యంతో ఉంటున్నాయి. భూగర్భంలో ఉండే స్వచ్ఛమైన జలవనరులు ఎండిపోతున్నాయి. తాగేందుకు గుక్కెడు నీళ్ళు దొరక్క దేశంలో కోట్లాదిమంది జనం అల్లాడిపోతున్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వాలు తగు శ్రద్ధ తీసుకోకపోవడం విచారకరం. జలం ఉంటేనే జాతికి బలం. ఆ జీవజలమే అందరికీ శ్రీరామరక్ష!.అందుకే ప్రతి నీటి బొట్టునూ కాపాడుకోవాలి. పచ్చదనాన్ని, పర్యావరణాన్నీ పరిరక్షించుకోవాలి. అదే మనందరి తక్షణ కర్తవ్యం!....

## శ్రీ సాయినాధునికి నేత్రపర్వంగా పూలరథోత్సవం

శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మార్చి 25న నెల్లూరులోని చిన్నపిల్లల పార్కు సమీపంలో ఉన్న శ్రీ సాయిసదన్ మందిరంలో శ్రీ షిర్డీ సాయినాధునికి పూల రథోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి భక్తిసంకీర్తనలు, పండరి భజనలు, కోలాటాలు, బాణసంచావేడుకలు.. సాయి నామస్మరణలు మార్మోగాయి. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి ఉత్సవాలను తిలకించారు. అనంతరం స్వామివారికి పల్లకి ఉత్సవం, గంధమహోత్సవం ఎంతో సందడిగా జరిగాయి. మందిరం నిర్వాహకులు కొండ్రెడ్డి శ్రీనివాసులురెడ్డి సారధ్యంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం సాయిసదన్‌లో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

## 'గీతాంజలి' ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సేవాశిబిరం

నెల్లూరులోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఇటీవల కోవూరు మండలంలోని గంగవరం గ్రామంలో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గ్రామ సర్వే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.సుబ్బారావు మాట్లాడుతూ, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గంగవరం గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ట్రిపుల్‌-ఇ విభాగాధిపతి ఈ సందర్భంగా మాట్లాడుతూ, గంగవరంలో పలు సామాజిక అంశాలపై గ్రామస్తులకు అవగాహన, చైతన్యం కల్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి రమణమ్మ, విఆర్ఓ జయరాజ్, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, కార్యక్రమ అధికారి ఎమ్.మహేష్‌కుమార్ పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న గీతాంజలి విద్యార్థులు

## వై.యస్ తనయుడనిపించుకున్నాడు

2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చుంటే కేవలం వై.యస్. రాజశేఖరరెడ్డి సానుభూతితోనే జగన్ గెలిచాడనుకునేవాళ్ళు. జగన్ ఆరోజు ఓడిపోబట్టే ప్రతిపక్ష నాయకుడిగా తనను తాను మలచుకున్నాడు. ప్రజానాయకుడిగా ఎదిగాడు. ప్రజల్లో తిరిగాడు. ప్రజల సమస్యలు తెలుసుకోగలుగుతున్నాడు. ప్రభుత్వ అవినీతి అక్రమాలను ధీటుగా ఎదుర్కొన్నాడు. ప్రత్యేకహోదా ఉద్యమం ద్వారా ప్రజల మనసులకు చేరువయ్యాడు. ఈరోజు జగన్ అంటే ప్రజల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకుడని, ఓట్ల కోసం ఉత్తుత్తి హామీలు చేయడనే అభిప్రాయం వచ్చింది. రేపు ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చినా అది జగన్ కష్టార్జితమే అవుతుందిగాని, వై.యస్. సానుభూతి వల్ల కాదు.

**పట్నం రాఘవ, నెల్లూరు.**




## వీడేం జర్నలిస్టు?

ఆంధ్రప్రదేశ్‌లో మీడియా గబ్బు గబ్బుగా తయారైందని తెలుసు. ఇంత గలీజుగా తయారైందనుకోలేదు. ఇటీవల టీవీ5 ఛానెల్‌లో సినీ నటులు పోసాని కృష్ణమురళీతో ఇంటర్వ్యూ సందర్భంగా ఆ ఛానెల్ ప్రతినిధి సాంబశివరావు వాడిన భాష చూస్తే ఇలాంటి వాళ్ళను దేంతో కొట్టినా పాపం లేదనిపిస్తుంది. సినిమావాళ్ళపై, సినిమా నటీమణులపై అభ్యంతరకర భాష వాడాడు. మీడియాలో వుండడానికి అనర్హుడు సాంబశివరావు. ఇతనికి పచ్చకామెర్లు వచ్చినట్లున్నాయి. చంద్రబాబు మీద వున్న అభిమానాన్ని బహిరంగంగానే చాటుకునే ప్రయత్నం చేసాడు. వాస్తవాలు మాట్లాడితే బెదిరిపోతున్నాడు. అన్నింటికి పోసాని కృష్ణమురళీ చెప్పుతో కొట్టినట్లు సమాధానం చెప్పాడు.

**యదగండ్ల చినసత్యం, బుచ్చి.**

## కేంద్ర పెన్షనర్ల సమాచారం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం... ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థల నుండి రిటైర్డ్ అయిన ఉద్యోగులు తాము ప్రభుత్వేతర సంస్థలు, ప్రైవేట్ వ్యాపార సంస్థలలో పాల్గొనడం లేదని డిక్లరేషన్ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఒకవేళ ప్రభుత్వం ఆక్షేపిస్తే పెన్షనర్లు తమ ప్రైవేట్ ఉద్యోగాలను ఉపసంహరించుకుంటామని ప్రకటన చేయాల్సి ఉంటుంది. కొన్ని ఎన్‌జిఒ సంస్థలు ఎఫ్‌సిఆర్ఏ నిబంధనల మేరకు అంతర్జాతీయ నిధులను దేశ వ్యతిరేక కార్యకలాపాలకు వెచ్చిస్తున్నారనే ఆరోపణలు వచ్చినందున కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దేశ ఆంతరంగిక భద్రతకు, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడడానికి ఇది చాలా అవసరం. కాబట్టి కేంద్రప్రభుత్వ పెన్షనర్లు తగు సమాచారాన్ని కేంద్ర కార్యాలయాలకు అందించాలి.

**– ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

## గిట్టుబాటు ధరలేవి?

ధాన్యం ధరలు బాగా తగ్గిపోయాయి. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు లబోదిబోమంటున్నారు. అధికారులు జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసామంటున్నారు. వాటి ద్వారా కొనుగోళ్ళు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. కల్లాల్లో ధాన్యాన్ని దళారులే కొనేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు పోవాలంటే రైతులకు రవాణా పెద్ద భారంగా మారింది. అక్కడ నిబంధనలు వీళ్ళకు సరిపడడం లేదు. దళారులైతే పుట్టికి వెయ్యి రూపాయలు తగ్గించినా నేరుగా కల్లాల్లోనే కొంటున్నారు. అందుకే రైతులు గిట్టుబాటు ధరలు లేకున్నా దళారులకే ధాన్యం తెగనమ్ముకుంటున్నారు.

**– సూరపు నాగేశ్వరరెడ్డి, అల్లూరు.**



# బీజేపీ బలపడేనా?

**భారతీయ జనతాపార్టీకి సంబంధించి నెల్లూరు జిల్లాకు ఒక ప్రత్యేకత వుంది. జాతీయ రాజకీయాల్లో వాజ్‌పేయి, అద్వాని, మురళీమనోహర్ జోషి వంటి సీనియర్‌ల తర్వాత పార్టీలో అంతటి సీనియార్టీ కలిగిన నాయకుడు, బీజేపీని ఆసాంతం చదివిన నేత, ప్రస్తుత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యానాయుడు నెల్లూరుజిల్లా వారు కావడమే ఆ ప్రాధాన్యత.**

వెంకయ్యానాయుడు సొంతజిల్లాలో బీజేపీ పరిస్థితి గతంలో ఏంటి? ఇప్పుడెలావుంది? రేపు ఎలా వుండబోతోంది? అన్నది ప్రశ్న! బీజేపీ పార్టీని స్థాపించాక ఈ రాష్ట్రంలో ఆ పార్టీ తొలిసారి పోటీ చేసిన 1983 ఎన్నికల్లో వెంకయ్యానాయుడు ఉదయగిరి అసెంబ్లీ నుండి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఈ జిల్లాకు సంబంధించినంత వరకు బీజేపీకి అదే తొలిగెలుపు. ఇప్పటివరకు చివరి గెలుపు కూడా! ఎందుకంటే ఆ తర్వాత ఏ ఎన్నికల్లోనూ బీజేపీ గెలవలేదు. ఒంటరిగా పోటీ చేసిన ఎన్నికల్లోనే కాదు, తెలుగుదేశంతో పొత్తు కుదుర్చుకుని పోటీ చేసిన ఎన్నికల్లో కూడా ఆ పార్టీ గెలవలేదు. ఒకరకంగా చెప్పాలంటే 1980 దశకంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీకి ఎంతో కొంత బలం ఉండేది. పటిష్టంగా పనిచేసే కార్యకర్తలుండేవాళ్ళు. వెంకయ్యానాయుడు లాంటి నాయకుడు రాష్ట్ర రాజకీయాల్లో, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్ళడం, పార్టీలో అంతర్గత విభేదాలు, తెలుగుదేశంతో పొత్తు ఆ పార్టీ బలాన్ని నిర్వీర్యం చేస్తూ వచ్చాయి. 1985 ఎన్నికల నుండి కూడా ఆ పార్టీ టీడీపీతో పొత్తు పెట్టుకోవడం, మళ్ళీ విడిపోవడం... ఇలాంటి చర్యల మూలంగా ఆ పార్టీ బలహీన పడింది. సొంతంగా ఎదగలేకపోయింది. చాలావరకు బీజేపీ కేడర్ ఇతర పార్టీలవైపు వెళ్ళిపోయింది. జిల్లాలో కేవలం కొద్దిమంది నాయకుల పార్టీగా మాత్రమే ఆ పార్టీ మిగిలిపోయింది.

ఇప్పుడు మరోసారి తెలుగుదేశంతో పొత్తు తెగిపోయింది. ఆ పార్టీతో పొత్తున్నప్పుడల్లా బీజేపీ నాయకులకు ఒకటి అరా సీట్ల నుండి మాత్రమే పోటీకి అవకాశమొచ్చేది. ఇప్పుడు రెండు లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేయొచ్చు. దీనికితోడు స్థానిక సంస్థల పదవులకు సంబంధించి బోలెడు సీట్లున్నాయి. కనీసం ఎన్నికలను ఎదుర్కొనేంత సైన్యమన్నా బీజేపీలో వుందా? మనకు నిద్రలేస్తే సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, కందుకూరి సత్యనారాయణ, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి... ఒక మాదిరి నాయకులుగా కనిపిస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా పోటీలో నిలిచి సొంతంగా ఎన్నికలను ఎదుర్కొనే సామర్థ్యం బీజేపీకి ఇప్పుడిప్పుడే వచ్చే అవకాశాలున్నాయా అన్నదే పెద్దప్రశ్న?

# రాజన్నే నా రాజకీయ గురువు



## ● వై.యస్.కు నివాళులర్పించిన విపిఆర్

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మార్చి 24వ తేదీన వైయస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఘాట్‌ను సందర్శించారు. వై.యస్. సమాధి వద్ద పూలమాల వుంచి నివాళులర్పించారు. తన రాజకీయ గురువు వైయస్సేనని, ఆయన ఆశయాలే తనకు ఆదర్శమని ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు నడపడంలో రాజన్నకు ఎవరూ సాటిరారన్నారు. వై.యస్.రాజశేఖరరెడ్డి గొప్ప ప్రజాపాలకుడని, ప్రజల గుండెల్లో నిలిచారని చెప్పారు. రాష్ట్ర ప్రజలే తన కుటుంబసభ్యులుగా భావిస్తూ, ఎండనకా వాననకా ప్రజల మధ్య తిరుగుతూ, ప్రజల కష్టనష్టాలు తెలుసుకుంటున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమని, తన తండ్రి వై.యస్.ను మరపించే పరిపాలన జగన్ అందిస్తాడని పేర్కొన్నారు. ఆయన వెంట కడప ఎంపి వై.యస్.అవినాష్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు ఉన్నారు.



# మైనార్టీకా? మహిళకా?



చంద్రబాబునాయుడు చేతిలోకి తెలుగుదేశం పార్టీ వచ్చాక జరిగిన అన్ని ఎన్నికలలోనూ జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానాన్ని మహిళలకు ఇస్తూ వచ్చాడు. 1999లో వెంకటగిరిని సినీ నటి శారదకు, 2004లో గూడూరును ఉక్కాల రాజేశ్వరమ్మకు, 2014 ఎన్నికల్లో గూడూరు సీటును డాక్టర్ బి.జ్యోత్స్నలతకు ఇచ్చారు. 2009 ఎన్నికల్లో మాత్రం ఆ కాన్సెప్ట్‌ను అమలు చేయలేదు. వచ్చే ఎన్నికల్లో మాత్రం ఒక సీటును మహిళలకు గాని లేదంటే మైనార్టీలకు గాని ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన గూడూరు సీటును ఈసారి వైకాపా నుండి జంప్ చేయించిన సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కే ఇవ్వొచ్చు. కాబట్టి అక్కడ ఆశ లేదు. వున్న అవకాశమల్లా నెల్లూరుసిటీ లేదంటే సూళ్ళూరుపేట! ఈ రెండు సీట్లలోనే ప్రయోగాలు చేయగలరు! మహిళలకు నెల్లూరుసిటీ లేదా సూళ్లూరుపేటలలో దేనినైనా ఇవ్వొచ్చు. సూళ్ళూరుపేట అయితే ఎస్సీ మహిళను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌ఛార్జ్ పరసా రత్నం మీద వ్యతిరేకత బలంగా వుంది. స్థానికంగా వున్న టీడీపీ నాయకులు ఈసారి అభ్యర్థిని మార్చాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ మహిళా అభ్యర్థి పోటీకి అవకాశముంది. ఇక రెండోది నెల్లూరు నగరం. ఇక్కడ జనరల్ మహిళ లేదంటే మైనార్టీలకు సీటివ్వడానికి అవకాశముంది. మహిళలకే సీటివ్వాలనుకుంటే మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధతో పాటు పార్టీలో ఇటీవల కీలకంగా మారిన వసంత లక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ శ్రీమతి వసంతలక్ష్మి లాంటి వాళ్ళున్నారు. నెల్లూరు నగరంలో ముస్లింల ఓట్ల శాతం ఎక్కువ కాబట్టి ఆ వర్గానికి చెందిన వారికి కూడా అవకాశముంది. మేయర్ అబ్దుల్ అజీజ్ ఈ ప్రయత్నాల్లోనే వున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో వున్న 10సీట్లలో టీడీపీ నుండి ఒక సీటు మైనార్టీలకు గాని మహిళలకు గాని గ్యారంటీ అని చెప్పొచ్చు.

# లాభాల బాటలో డిసిఎంఎస్

## — ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి



ఎట్టకేలకు నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లాభాల బాట పట్టింది. రైతులకు అవసరమైన చేయూతనిస్తూ, సొసైటీ కార్యకలాపాలను విస్తరిస్తూ అందరి సహకారంతో ముందుకుపోతోంది. మార్చి26న నెల్లూరులోని డిసిఎంఎస్ కార్యాలయంలో జరిగిన మహాజనసభలో ఛైర్మెన్ సుమంత్‌రెడ్డి సొసైటీ రైతుల ప్రయోజనం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. 2017-18 సంవత్సరానికి ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు ప్రారంభమైందని, రబీ సీజన్‌లో కూడా ఈ ధాన్యం కేంద్రాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి ఆశించిన స్థాయిలో లాభాలు లేకుండా ఇబ్బందుల్లో ఉన్న మార్కెటింగ్ సొసైటీ ఇప్పుడు పూర్తిగా కోలుకుందన్నారు. తేమశాతం పేరుతో మిల్లర్లు రైతులను నట్టేట ముంచుతున్నారంటూ కొందరు రైతులు ఈ సందర్భంగా అధికారులను నిలదీశారు. లారీల్లో ఎక్కించిన ధాన్యాన్ని రైసుమిల్లుల యజమానులు రోజుల తరబడి అన్‌లోడ్ చేయకపోవడం, పుట్టికి ఎక్కువ మొత్తంలో తరుగు తీయడం, ట్యాగింగ్‌లో ఆలస్యం చేస్తుండడంతో అత్యధిక శాతం మంది రైతులు ఎన్నో కష్టనష్టాలకు గురవుతున్నారని లబోదిబోమన్నారు. దీంతో సభకు వచ్చిన పౌరసరఫరాల డిఎం కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి డిఎస్‌ఓ ఎంవి రమణ వివరణ ఇస్తూ, ధాన్యం సేకరణలో సమస్యలు వస్తున్నది వాస్తవమేనని, అయితే, జిల్లాలో 168 పిపిసి సెంటర్లలో వెలుగుకు కేవలం 40 కేంద్రాలు మాత్రమే ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్, డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, వైస్ ఛైర్మెన్ ఎన్. జగన్మోహన్‌రెడ్డి, డిసిఓ సుధాభారతి, డిఎల్పీఓ తిరుపాల్‌రెడ్డితో పాటు సొసైటీ పాలకమండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# గూడూరు రేస్‌లో విజయకుమార్?



బత్తిని విజయకుమార్... ఈ పేరు గూడూరు నియోజకవర్గంలో తెలియనివారుండరేమో! వైసిపి ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతం కోసం, పార్టీ అభివృద్ధి కోసం నేటివరకు సేవ చేస్తూ చిన్నపదవిని కూడా పొందని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది విజయకుమారే! మరి ఈయన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించకపోవడంపై వైసీపీలోనే పలువురు కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో పనిచేసే ప్రతి నాయకుడికి ఒక గుర్తింపు ఉంటుందని, ఆ గుర్తింపు ఇచ్చేది కేవలం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మాత్రమేనని చెప్పిన పరిస్థితులు ఉన్నాయి. 2014లో వైసిపి ఎమ్మెల్యే టిక్కెట్‌కు పాశం సునీల్‌కుమార్, బత్తిని విజయకుమార్ పేర్లు వినపడ్డాయి. ఆ ఎన్నికల్లో వైసిపి టికెట్టు పాశం సునీల్‌కు ఇవ్వడం జరిగింది. ఆనాడు నిరాశకు లోనైనా కూడా బత్తిని విజయకుమార్ పార్టీ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యంగా భావించి పార్టీకోసం పని చేసాడు. దివంగత నేత వై.యస్. రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌పార్టీ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయన సమక్షంలోనే బత్తిని విజయకుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజశేఖరరెడ్డి చనిపోయిన తరువాత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైసిపిలో పనిచేస్తూ గూడూరు నియోజకవర్గంలో వైయస్సార్‌పార్టీ తలపెట్టిన బంద్‌లు, ధర్నాలు, రాస్తారోకోలలో ఆనాటి నుండి ఈనాటి వరకు పాల్గొంటున్న నాయకుడు బత్తిని విజయకుమార్.

2014లో టీడీపీలోని కొంతమంది పెద్దలు తెలుగుదేశం పార్టీ తరపున గూడూరు ఎమ్మెల్యేగా పోటీ చేయమని బత్తిని విజయకుమార్‌పై ఒత్తిడి తెచ్చినా అతను మాత్రం వై.యస్. జగన్మోహన్‌రెడ్డిని వీడిరానని అన్నారు. 2019లో అయినా గూడూరు వైసిపి టిక్కెట్ జగన్మోహన్‌రెడ్డి కరుణించి ఇవ్వకపోతాడా అనే ఆశతో పార్టీలో ఉంటూ అందరితో కలసి పని చేసుకుంటూ ముందుకు వెళుతున్నాడు బత్తిని.

మరి ఆయన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి పార్టీ పదవిని ఇస్తారా లేక ఏకంగా వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తారా? అన్నది కాలమే నిర్ణయించాలి.



# నెల్లూరు కబుర్లు

## కాలువలు కాదు...
# రోడ్లపై పడండి
### - మంత్రి ఆదేశాలతో ముమ్మరంగా పనులు



నెల్లూరు నగరంలో ఈ మధ్యంతా కూడా డ్రైనేజీ పనులు ముమ్మరంగా చేశారు. ఏ ప్రాంతంలో చూసినా సైడు కాలువల పనులు బాగానే జరుగుతూ కనిపించాయి. అయితే ఈ డ్రైనేజీల నిర్మాణం వల్ల అనుకున్న మైలేజీ రావడం లేదని మున్సిపల్ మంత్రి పి.నారాయణకు అర్థమైపోయింది. ఎందుకంటే నగరంలో భూగర్భ డ్రైనేజీ కోసం అన్ని రోడ్లను పగలగొట్టిపెట్టారు. ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పాలకులను జనాలు రోజూ తిట్టుకోవడమే పనవుతోంది. దీనిని గ్రహించిన నారాయణ నగరంలో రోడ్ల పనులపై దృష్టి పెట్టారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను నెల్లూరుకు బాగానే తెచ్చి దీని క్రింద ముమ్మరంగా రోడ్ల పనులు మొదలుపెట్టించారు.

## అపోలో వైద్యునికి అంతర్జాతీయ పురస్కారం

నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ ఎం.వి.రామ్మోహన్‌కు అంతర్జాతీయ పురస్కారం లభించింది. ఇటీవల అమెరికాలోని చికాగోలో జరిగిన అంతర్జాతీయ 100వ ఎండోక్రైన్ సదస్సులో హెల్‌మెస్లీ ట్రస్ట్ అవార్డుతో పాటు వెయ్యి డాలర్ల పురస్కారాన్ని అందించింది. ఎండోక్రైనాలజిస్ట్‌గా డాక్టర్ ఎం.వి.రామ్మోహన్ చిన్నపిల్లల్లో వచ్చే మధుమేహ వ్యాధికి సంబంధించి అనేక పరిశోధనలు చేసి నివేదిక పత్రాలను సమర్పించారు. ఆయన కృషిని, పరిశోధనా ఫలితాలను గుర్తించిన హెల్‌మెస్లీ ట్రస్ట్ ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్న తొలి ఆంధ్రా వైద్యుడు డాక్టర్ రామ్మోహన్ కావడం విశేషం. ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్న రామ్మోహన్‌కు 'లాయర్' అభినందనలు.



పురస్కారంతో డా॥ ఎం.వి.రామ్మోహన్

## రోడ్లేశారు... డివైడర్ మరిచారు



గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నెల్లూరులోని ఆనం వెంకటరెడ్డి బొమ్మ నుండి ధనలక్ష్మీపురం వరకు ముత్తుకూరు రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించారు. కానీ అప్పుడే మధ్యలో డివైడర్ కూడా నిర్మించి వుంటే ఓ పనైపోయివుండేది. డివైడర్ నిర్మించలేదు. దీంతో వాహనాలు అడ్డదిడ్డంగా పరుగులు తీయడం పరిపాటైపోయింది. యాక్సిడెంట్‌లు సర్వసాధారణమైపోయాయి. ఇటీవల కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొద్ది దూరం కాంక్రీట్ డివైడర్ నిర్మించారు. మిగతా రోడ్డులో కూడా డివైడర్ నిర్మిస్తే వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతాయి.

## హోటళ్ళలో తనిఖీలు

నెల్లూరు నగరంలో 24, 25తేదీలలో గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు హోటళ్ళలో తనిఖీలు నిర్వహించారు. మల్టీక్యూసైన్ రెస్టారెంట్‌లతో పాటు తోపుడు బండ్ల టిఫిన్ సెంటర్‌ల వద్ద కూడా తనిఖీలు నిర్వహించారు. అన్ని హోటళ్ళ నుండి శాంపిల్స్ సేకరించారు. అన్ని శాంపిల్స్‌ను ల్యాబ్‌లకు పరీక్షల నిమిత్తం పంపించారు. హోటళ్లలో ఆహార పదార్థాలపై పలు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైన కలర్ కోటింగ్ ఒకటి. నాన్‌వెజ్, వెజ్ వంటకాలకు ఈ కోటింగ్ వేస్తుంటారు. రిఫ్రిజిరేటర్‌లలో మాంసాన్ని నిల్వ వుంచడం... అయిపోయేంత వరకు దానినే వాడడం... కల్తీ ఆయిల్స్, కల్తీ దినుసులు... పరిశుభ్రత లేని వంటశాలలు... వంటవాళ్ళు... ఇవే రెస్టారెంట్లలో ప్రధానంగా ఎదురయ్యే సమస్యలు. ఈ తనిఖీల ద్వారా సమస్యలు ఎంతవరకు పరిష్కారమవుతాయో చూడాలి!

# సోమిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సోమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న తెదేపా నాయకులు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా 26వ తేదీ అల్లీపురంలోని ఆయన ఇల్లు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆప్తులతో కిక్కిరిసిపోయింది. జిల్లాలోని అన్ని మండలాల నుండి నాయకులు, అనుచరులు, అధికారులు పెద్దసంఖ్యలో వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సోమిరెడ్డి తొలుత ప్రభుత్వ పాఠశాల చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి వారందరికీ పంచిపెట్టారు. షిరిడి సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించారు. అభిమానులు ఆయన జన్మదినోత్సవం సందర్భంగా భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 152మంది రక్తదానం చేసారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు, వివిధ శాఖల అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

## బ్యాంకులకు సెలవులే సెలవులు

నోట్ల రద్దు తర్వాత జనాలకు నగదు కష్టాలు కంటిన్యూ అవుతూనే వున్నాయి. బ్యాంకులకు సెలవొచ్చిందంటే కరెన్సీ కష్టాలు పునరావృతమవుతున్నాయి. ఇది మార్చి నెల. ఆర్థిక సంవత్సరం ముగింపు మాసం. బ్యాంకులు ఋణాలు ఇవ్వడం లేదు, సరికదా ఎవరైనా డిపాజిట్లు విత్‌డ్రా చేసుకోవాలన్నా, అకౌంట్‌లో నగదు తీసుకోవాలన్నా ఈ నెలాఖరు వరకు ఉంచండని బ్రతిమలాడుకుంటున్నారు. దీంతో నగదు చెలామణి తగ్గిపోయింది. దీనికితోడు మార్చి 25, 26తేదీలలో ఆది వారం, శ్రీరామనవమి సెలవులు. ఆ రెండు రోజులు ఎక్కడా ఏటిఎంలు సక్రమంగా పనిచేయలేదు. కనీసం క్యాష్ డిపాజిట్ మిషన్‌లు కూడా పని చేయలేదు. 27, 28తేదీలు మాత్రమే మళ్ళీ బ్యాంకులు పని చేశాయి. 29వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు వరుసగా నాలుగురోజులు బ్యాంకులకు సెలవులు. ప్రజల కళ్ళ ముందు కరెన్సీ సినిమా కదలాడుతోంది.

## టీడీపీ నేతకు మంత్రి పరామర్శ

అనారోగ్యంతో నెల్లూరులోని కిమ్స్ (బొల్లినేని) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీకౌన్సిలర్ నావూరు శైలేంద్రబాబును 25వ తేదీ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుగ్గా పాల్గొనాలని మంత్రి ఆకాంక్షించారు.

## ఇక్కడ స్వచ్ఛభారత్ అక్కర్లేదా?

జిల్లా కోర్టు ప్రాంగణంలో మొదటగా స్వచ్ఛభారత్ నిర్వహించాల్సిన అవసరముందనిపిస్తుంది. కోర్టు ప్రాంగణాలను, బాత్‌రూమ్‌లను, వరండాలను కొందరు గలీజు చేస్తున్నారు. న్యాయవాదులు గుమికూడే బార్ అసోసియేషన్ కార్యాలయం కూడా అపరిశుభ్రంగానే వుంటోంది.

## ఫ్రెండ్స్ వాకర్స్ శ్రీరామనవమి వేడుకలు



వడపప్పు, పానకం పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ సభ్యులు

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, వాకర్స్‌మిత్రులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలరామయ్యనాయుడు శ్రీరామనవమి ప్రాశస్త్యాన్ని, స్వామివారి ప్రసాదంలోని ఔషధ గుణాలను వివరించారు. 203, జిల్లా వాకర్స్ అంతర్జాతీయ సంస్థ మాజీ గవర్నర్ బి. మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాకర్స్ కార్యవర్గసభ్యులు జి.వి.కృష్ణయ్య, దొడ్ల జయరామనాయుడు, లక్కాకుల శ్రీనివాసులు, బి.సూర్యనారాయణ, పి.రంగయ్య, మునునూరు పిచ్చయ్య, ఎన్.సాయిసుబ్బారావు, ఏ.శేషయ్యతో పాటు జాలీవాకర్ శ్రీమతి ఇనుకొండ సోని తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న రెయిన్‌బో కలర్స్-2018



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న రెయిన్‌బో స్కూల్ వార్షిక దినోత్సవాన్ని ఇటీవల స్థానిక అనిల్‌గార్డెన్స్‌లో 'రెయిన్‌బో కలర్స్-2018' పేరుతో కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ శ్రీమతి అరుణాస్వయంప్రభ మాట్లాడుతూ, విద్యార్థులను అన్నిరంగాల్లో ప్రతిభావంతంగా తీర్చిదిద్దడమే కాక, వారు ఉత్తమ పౌరులుగా తయారయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల వార్షిక ప్రగతినివేదిక చదివి వినిపించారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

## ప్రచారంపై శ్రద్ధ...

# ప్రజల సమస్యలపై పెట్టండి

### - టీడీపీకి ఎమ్మెల్యే అనిల్ హితవు



కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తెలుగుదేశం పాలకులు ప్రచారంపై చూపిస్తున్న శ్రద్ధ, ప్రజా సమస్యలపై చూపిస్తే కొన్ని సమస్యలైనా పరిష్కారం అవుతాయని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 27న ఆయన డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌తో కలిసి 46వ డివిజన్ పరిధిలోని ట్రంకురోడ్డు, ముంగమూరువారి వీధి, ఆచారివీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నగరంలో ట్రంకురోడ్డు వ్యాపార కేంద్రమని, అటువంటి ప్రాంతంలో ఆరునెలల క్రితం వర్షాల నెపంతో కాలువలు తవ్వి వదిలేసారని, ఇంతవరకు పనులు పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకుని పనులు చేయకుంటే ఆ టెండర్‌ను రద్దుచేసి మరో టెండర్ వేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తిచేయాల్సిన బాధ్యత నెల్లూరు నగరపాలక సంస్థపై ఉందన్నారు. నగరంలో అనేక ప్రాంతాల్లో కాలువలు తవ్వడం వదిలివేయడం తప్పితే, వాటిని నిర్మించాలన్న ఉద్దేశ్యం కార్పొరేషన్ పాలకుల్లో కనిపించడం లేదన్నారు. ఇటీవల కాలంలో కార్పొరేషన్‌లో డబ్బులు లేవంటూనే ప్రజాధనాన్ని పబ్లిసిటీకి ఖర్చు చేస్తున్నారని, కార్పొరేషన్‌కి వచ్చే ప్రతిరూపాయి ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిందేనని, ఆ డబ్బును వృధా చేసే హక్కు ఎవరికీ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్లో ఘోరమైన దోపిడీ జరుగుతుందని, పనులన్నీ నాసిరకంగా జరుగుతున్నాయని, వీటిపై విచారణ జరిపించాలని విజిలెన్స్ అధికారులను కోరనున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఎం.డి.ఖలీల్ అహ్మద్, గోగుల నాగరాజు, వైసిపి నాయకులు వేలూరు మహేష్, వంగవాని రంగ, దార్ల వెంకటేశ్వర్లు, వేలూరు రఘు, కొప్పోలు చంద్రశేఖర్, కాయల సురేష్‌బాబు, గంధం సురేష్‌బాబు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దిగుబడిలో రికార్డు సృష్టించాం

### - రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి



తోడేరు చెరువును పరిశీలిస్తున్న మంత్రి సోమిరెడ్డి

జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు నీరు అందించడం ద్వారా సుమారు ఎకరాకు నాలుగు పుట్లపైన పండించి 30 లక్షల పుట్ల పైన వరి దిగుబడి సాధించడం గొప్ప విషయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మార్చి25వ తేదిన పొదలకూరు మండలంలోని తోడేరు వద్ద ఉన్న చిన్న చెరువును మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కృష్ణానది నుంచి శ్రీశైలం, సోమశిల, కండలేరు రిజర్వాయర్లకు 22 టిఎంసిల నీటిని తరలించి, మెట్ట ప్రాంత భూములను కూడా మాగాణి భూములతో సమానంగా సస్యశ్యామలం చేయడం జరిగిందన్నారు. 20 ఏళ్ళ క్రితం నిర్మించిన కండలేరు ఎడమకాలువ నుండి 40 లక్షల వ్యయంతో సైఫన్‌ను నిర్మించి పొదలకూరు మండలంలోని అన్ని చెరువులకు నీరందించడం ద్వారా 25,600 ఎకరాలను సాగులోకి తీసుకురావడం జరిగిందన్నారు. శాశ్వత అక్విడెక్ట్ నిర్మాణానికి 4 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర విషయంలో రైతాంగానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని, బ్యాంకు గ్యారంటీ ఉన్న ఇతర జిల్లాల మిల్లర్లకు సైతం ధాన్యం సరఫరా జరుగుతున్నదని తెలిపారు. అదేవిధంగా ధాన్యాన్ని గోదాముల్లో ఉంచి ఇతర దేశాల ఎగుమతుల విషయమై శ్రీలంకతో చర్చలు జరుపుతున్నామన్నారు. స్వర్ణముఖి, కాళంగి నదులకు 5 టిఎంసిల నీరు అందించడం ద్వారా ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సమైఖ్యాంధ్ర ఉన్నప్పుడు రైతులకు ఇచ్చిన ఇన్‌పుట్ సబ్సిడీ కేవలం 340 కోట్లని, ఇప్పుడు విభజన అనంతరం గడిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రప్రభుత్వం ఈ 13 జిల్లాలకు 3,040 కోట్ల రూపాయలు వెచ్చించిందని వివరించారు. అదనంగా మరో 300 కోట్ల రూపాయలు కూడా రైతాంగానికి ఈ సబ్సిడీ కింద ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు నీటిసంఘాల ప్రతినిధులు, రైతు నాయకులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు పేదలకు అందేలా చర్యలు

### - లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ రాంబాబు



పేదల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు విస్తృతస్థాయిలో పేదలకు లబ్ది చేకూరేవిధంగా జాతీయ న్యాయ సేవా సంస్థలు చర్యలు చేపట్టడం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ పివిబి రాంబాబు అన్నారు. ఈ నెల 25వ తేదీన ఆయన నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయసేవల శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అసంఘటిత రంగ కార్మికుల మధ్య వారధిలా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, వాటిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండడం అవసరమని అన్నారు. లబ్దిదారులు సంక్షేమపథకాల పట్ల పూర్తి లబ్దిని పొందేవిధంగా అవసరమైన న్యాయ సహాయం చేయడం జరుగుతుందన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ, న్యాయసంబంధిత విషయాలపై ఆర్థిక స్తోమత ఉన్నవారికన్నా, ఆర్థికంగా వెనుకబడివున్న వారికి న్యాయ సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ అవగాహన శిబిరం ద్వారా వారి సమస్యల పరిష్కార మార్గాలను తెలుసుకోవచ్చున్నారు. ఈ సందర్భంగా ఆయన కోలింగ్ అనే సంఘసంస్కర్త అసంఘటిత రంగ కార్మికుల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. అదేవిధంగా యాసిడ్ దాడులకు గురైన మహిళా బాధితులకు ఉచిత వైద్యసేవలు అందించేవిధంగా కృషి చేయడాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవా సలహా సంఘం కార్యదర్శి పిజె సుధ, సంయుక్త కలెక్టర్-2 వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ శ్రీమతి ప్రశాంతి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. అనంతరం, వివిధ శాఖాధికారులు తమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలపై నివేదికను సమర్పించారు.

# సహకారంలో ముందున్నాం

### - డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు



సమావేశంలో మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

జిల్లా రైతాంగానికి అన్ని విధాలా చేయూతనివ్వడంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎప్పుడూ ముందే నిలిచిందని ఆ బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల బ్యాంకు సమావేశ మందిరంలో బ్యాంకు మహాజనసభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017 ఏప్రిల్ నుండి ఇప్పటివరకు రైతు వికాస్ పథకం ద్వారా 115కోట్లు ఋణాలు ఇచ్చామన్నారు. బ్యాంకు వందేళ్ళ వేడుకల్లో భాగంగా రైతుల కోసం ప్రకటించిన 2.8 శాతం వడ్డీ రాయితీ పథకం క్రింద 441 మంది రైతులకు 20.67లక్షల లబ్ది చేకూరిందన్నారు. జిల్లాలో అత్యధికంగా సూళ్ళూరుపేట సహకార బ్యాంకు 20వేల మంది రైతులకు 100కోట్ల ఋణాలను ఇచ్చి ప్రథమస్థానంలో నిలిచిందని చెప్పారు. గత ఐదేళ్ల తమ పాలనలో నష్టాల్లో వున్న బ్యాంకును లాభాల బాట పట్టించామని, 300కోట్లు వున్న వ్యాపార లావాదేవీలను 800కోట్లకు దాటించామన్నారు. నెల్లూరు సిటీ బ్రాంచ్, రామ్మూర్తి నగర్, గూడూరు, ఆత్మకూరు బ్రాంచ్‌లలో నాలుగు డిసిసిబి ఏటిఎంలను ఏర్పాటు చేసామన్నారు. రైతులకే కాక ఉద్యోగులకు గృహ, వాహన, వ్యక్తిగత ఋణాలను ఇస్తున్నామని, చేపల రైతులు, పాడి రైతులకు కూడా ఋణాలు ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తమ పదవీ కాలాన్ని పొడిగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మా సమస్యలు తీర్చండి

### - రిజిస్ట్రార్‌కు పరిశోధక విద్యార్థుల విన్నపం



విక్రమ సింహపురి యూనివర్శిటీలో పరిశోధక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనివర్శిటీ పరిశోధక విద్యార్థులు జొన్నలగడ్డ సుధీర్, మౌళి, వినయ్, నరేష్, కిషోర్, అబ్దుల్లా, రేవతి, స్వప్న, శ్రీవైష్ణవి, కీర్తి, శిల్ప తదితరులు 27వ తేదీ యూనివర్శిటీ పరిపాలనా భవనంలో రిజిస్ట్రార్ ఆచార్య దుర్గా ప్రసాదరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. వర్శిటీని కొత్త భవనాలలోకి మార్చి ఏడాది దాటినా క్యాంపస్‌లో తమకు కనీసం ఒక గదిని కూడా కేటాయించలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతి సంవత్సరం తగు స్థాయిలో పరిశోధనా నిధులు వస్తున్నా తగిన వసతులు కల్పించడం లేదు. ఎస్వీ యూనివర్శిటీలో ఎంత ఫీజుందో అంతే వసూలు చేయాల్సివుండగా, రెట్టింపు ఫీజు వసూలు చేస్తున్నారు. వర్శిటీలో కంప్యూటర్లు, పరిశోధనా పుస్తకాలు, డిజిటల్ లైబ్రరీ, ల్యాబ్ పరికరాలు, హాస్టల్ వసతి కల్పించాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# రామనామంతో పరవశించిన సింహపురి

- ఊరూరా..వాడవాడలా వేడుకగా శ్రీ సీతారాముల కల్యాణం
- ఆలయాలకు వేలాదిగా తరలివచ్చిన భక్తజనం


వేదపండితుల ఆశీర్వాదం అందుకుంటున్న మంత్రి నారాయణ దంపతులు


శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్

శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలు కన్నులపండువగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలు రామాలయాలకు వెళ్ళి స్వామివార్ల కల్యాణోత్సవాలను దర్శించుకుని తరించారు. అనేకప్రాంతాల్లో ప్రత్యేక వేదికల మీద సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నెల్లూరు నగరంలోని టిటిడి కల్యాణ మండపం ఎదురుగా ఉన్న రామకోటి మహాయజ్ఞం స్థూపం ప్రాంగణంలో శబరి శ్రీరామక్షేత్రం సారధ్యంలో సీతారాముల వివాహవేడుక అంగరంగవైభవంగా జరిగింది. వేలాదిమంది భక్తులు ఈ కల్యాణోత్సవానికి తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు రొంపిచెర్ల భావనాచార్యుల సారధ్యంలో వేదమంత్రోచ్చటనల మధ్య, మంగళవాయిద్యాల మధ్య సంప్రదాయబద్ధంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో స్వామివారికి పట్టువస్త్రాలు, వివాహవేడుక సందర్భంగా ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఈ కల్యాణోత్సవంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పి.నారాయణ దంపతులు పాల్గొన్నారు. అనంతరం టిటిడి కల్యాణమండపం ప్రాంగణంలో వేలాదిమంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. శబరి శ్రీరామక్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పానకం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ఈ కల్యాణ మహోత్సవానికి పిడూరు కిశోర్‌రెడ్డి, శరణ్య, పిడూరు భానుప్రకాష్‌రెడ్డి, నాగమణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అబ్దుల్ అజీజ్ యువసేన ఆధ్వర్యంలో భక్తులకు శీతలపానీయాలు అందజేశారు. మేయర్ అబ్దుల్ అజీజ్‌తో పాటు, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, రాజానాయుడు, టిడిపి నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు రాసిన రామకోటి పుస్తకాలను మహాయజ్ఞస్థూపంలో నిక్షిప్తం చేశారు.



### సీతారాముల కల్యాణోత్సవాలను దర్శించుకున్న ఎమ్మెల్యే అనిల్:

నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. పి.అనిల్‌కుమార్‌యాదవ్‌తో పాటు, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ ఓటిలి రవిచంద్ర, వైఎస్సార్‌సిపి నాయకులు కర్తం ప్రతాప్‌రెడ్డి, వేలూరు మహేష్, వి.శ్రీనివాసులురెడ్డి, మజ్జిగ జయకృష్ణారెడ్డి, సరాబు సుబ్రహ్మణ్యం, పబ్బిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొని శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలను దర్శించుకున్నారు.

### శ్రీ రంగనాధస్వామి ఆలయంలో :

శ్రీరామనవమి సందర్భంగా నగరంలోని శ్రీ రంగనాధస్వామి దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాధస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాములకు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించి, మధ్యాహ్నం కల్యాణోత్సవాన్ని వేడుకగా జరిపారు. ఆలయ కమిటీ ఛైర్మెన్ మంచికంటి సుధాకరరావు, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ వేడుక జరిగింది.

### మూలాపేట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో :


కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ

నగరంలోని మూలాపేట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యా ణోత్సవం వైభవంగా నిర్వహించారు. పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, ఏఎస్పీ బి.శరత్‌బాబు, ఏఎస్పీ (ఎ.ఆర్) వీరభద్రుడు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని దర్శించుకున్నారు. ఓఎస్డీ విఠలేశ్వరరావు, ఎస్‌బి డిఎస్పీ కోటారెడ్డి, డిఎస్పీ శ్రీధర్, హోంగార్డ్స్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు చంద్రమోహన్, హోంగార్డ్స్ ఆర్‌ఐ చిరంజీవి, పట్టణ సిఐలు సుధాకర్‌రెడ్డి, పాపారావు, వెంకటరావు, సంగమేశ్వర రావు, పోలీసు అధికారుల సంఘం నగరాధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో :

నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. మూలాపేటలోని శ్రీమూలస్థానేశ్వరస్వామి ఆలయం ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి వాకర్స్‌కు వడపప్పు, పానకం ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిఎస్‌డిఓ రమణయ్య, రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, ఒలింపిక్ కమిటీ సభ్యులు పి. రామమూర్తి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కిలారి తిరుపతినాయుడు, గుడుగుంట వేణుగోపాల్ పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు




సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి తదితరులు

## గూడూరు డివిజన్ వార్తలు

చిల్లకూరులోని మహిళా బ్యాంకు కార్యాలయ ప్రాంగణంలో మార్చి 24న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు బాగా చదువుకొని ప్రయోజకులై ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. నేడు పురుషులతో సమానంగా తామెందులోనూ తీసిపోమని అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా విద్యావంతులవుతారని తద్వారా కుటుంబంతో పాటు సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంపిపి వీరిబోయిన రమాదేవి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వృత్తి విద్యలో శిక్షణ పొంది ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా బ్యాంకు మేనేజర్ కృష్ణవేణి, కోట మార్క్స్ అధ్యక్షురాలు శంకరమ్మ, డాక్టర్ సుగుణమ్మ, చిల్లకూరు ఎంపిటిసి సభ్యురాలు మల్లాబత్తిన జీవని తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముడు.. అందరికీ ఆదర్శనీయుడు


సత్కారాన్నందుకుంటున్న బొగ్గరపు

శ్రీరామచంద్రుడు నేటి సమాజానికి, మానవజాతికి ఎంతో ఆదర్శనీయుడని ప్రముఖ కవి, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి కొనియాడారు. శ్రీరామనవమిని పురస్క రించుకుని టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి పర్యవేక్షణలో నిర్వహించిన శ్రీమద్రామాయణ ప్రవచనాల్లో భాగంగా, నెల్లూరు వేదాయపాళెం మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి 'రామాయణం-జాతికి సందేశం' అనే అంశంపై ప్రసంగించారు. శ్రీరామచంద్రమూర్తి అవతారమూర్తి అని, సకల సద్గుణశోభితుడని అన్నారు. కుమారునిగా, భర్తగా, అన్నగా, తండ్రిగా శ్రీరాముడు ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. శ్రీరామచరితం ఆచంద్రతారార్కం ప్రజల హృదయాల్లో నిలిచే ఉంటుందన్నారు. రామాయణం పారాయణం చేయడంవల్ల పుణ్యం కలగడమేకాక, మానవజన్మ ధన్యమవుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణమందిరం ధర్మకర్త సిహెచ్ వెంకటేశ్వర్లు, సభ్యులు ఎస్.సుబ్బరామరాజు, వి.శ్రీనివాసులు, కె.మాలకొండయ్య పాల్గొన్నారు.

# డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో జాతీయ సెమినార్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో మంగళవారం జాతీయ సెమినార్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భారతలక్ష్మి తెలిపారు. కామర్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా అనే అంశంపై జాతీయ సెమినార్‌ను నిర్వహించినట్లు తెలిపారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సహాయ ఆచార్యులు రమేష్‌రెడ్డి విద్యార్థినులకు డేటా ఆవశ్యకతను వివరించారు. డేటా భద్రత, డేటా ప్రాసెస్, డేటా అనాలసిస్, పరిశోధన ధోరణిని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ సిఆర్‌రెడ్డి, ప్రతినిధులు రాజేష్ తదితరులు ఉన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

సరైన నిర్ణయాలు తీసుకొనలేని స్థితి ఉంటుంది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. పెట్టుబడులకు వ్యాపార విస్తరణకు అనుకూల సమయం కాదు. ఉద్యోగులు అధికారులతో, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. వివాహాది ప్రయత్నాలలో జాప్యం జరుగుతుంది. ఆర్థిక పరమైన వత్తిడి ఇబ్బందులుండవచ్చును. ఖర్చులు ఏదో ఒక నెపంతో పెరుగుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆస్థి, కుటుంబ వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. ఆరోగ్యం ఫరవాలేదు. దూర ప్రయాణాలుంటాయి. కొత్త వస్తువులు సమకూరడం, ఇతరులకు సహాయ పడటం చేస్తారు. అధికారవర్గ సహాయ సహకారాలు పొందుతారు. కోర్టు కేసులు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి పురోగతి ఉంటుంది. ఆదాయం బాగుంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్థ, పునర్వసు 1, 2, 3పాదాలు

నూతన పరిచయాలు కలిగి మేలు జరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. ఆహ్వానాలు అందుకొంటారు. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగులు అధికారులతో సన్నిహితం కాగలరు. స్థాన మార్పు ప్రయత్నాలు జరుగుతాయి. అవసరాలు, అనుకున్న పనులు నెరవేరతాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. వ్యాపార విస్తరణకు మంచి సమయం.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

శుభకార్యాలలో పాల్గొంటారు. రావలసిన బాకీలు కొంత లభించడం, గతంలోని ఆర్థిక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులు కలుగగలవు. అనుకోని ఖర్చు ఒకటి పైనబడుతుంది. దైవకార్యాలకు సహాయం చేస్తారు. అనుకున్న పనులు సవ్యంగా జరగడం వల్ల సంతృప్తి ఉంటుంది. కుటుంబంలో అభిప్రాయబేధాలుండి సర్దుబాటు కాగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వస్తు, వాహన రిపేర్లుంటాయి. కొత్త నిర్మాణాలు చేపడుతారు. శుభకార్యాలలో పాల్గొంటారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఇతరుల వల్ల విమర్శలు, అభియోగాలు ఎదుర్కొనవలసి ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండి ఆదాయం కూడా బాగుంటుంది. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధువుల వల్ల ఇబ్బందులేర్పడవచ్చును. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. దూర ప్రయాణాలు, శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. మంచి పనులకు సహాయమందిస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులు తమ పనులందు జాగ్రత్తపడటం మంచిది. అనుకోని ఖర్చులు భారం పైనబడుతుంది. అయినా ఇబ్బందులను అధిగమిస్తారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 30.3.2018 నుండి**
**తేది. 5.4.2018 వరకు**

ఈ వారము మేషంలో శుక్రుడు, కర్కాటకంలో రాహువు, సింహ కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు, తులలో గురువు, ధనుస్సులో శని కుజుడు, మకరంలో కేతువు, మీనంలో రవి బుధులు సంచరిస్తారు.

**పంచాంగము : ముహూర్తములు**

తేది 30 శుక్రవారం ఉదయం గంట 8.00లకు మేష లగ్నమున వివాహ వ్యాపార గృహారంభము. తేది 1 ఆదివారము ఉదయము గంట 7.54లకు మేష లగ్నమున వివాహ వ్యాపారములు. తేది 4 బుధవారము రాత్రి గంట 8.15లకు తులా లగ్నమున వివాహ గృహప్రవేశములు.

**చైత్రమాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 30 | శుక్ర | చతుర్దశి | రా॥ గం.7.0వ॥ |
| తేది. 31 | శని | పూర్ణిమ | సా॥ గం.5.50వ॥ |

**చైత్రమాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 1 | ఆది | పాడ్యమి | సా॥ గం.5.00వ॥ |
| తేది. 2 | సోమ | విదియ | సా॥ గం.4.53వ॥ |
| తేది. 3 | మంగళ | తదియ | సా॥ గం.5.10వ॥ |
| తేది. 4 | బుధ | చతుర్థి | సా॥ గం.5.54వ॥ |
| తేది. 5 | గురు | పంచమి | రా॥ గం.7.10వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతాయి. పిల్లల వల్ల కొద్ది ఇబ్బందులు కలుగవచ్చును. శుభకార్య నిర్ణయాలలో జాప్యం జరుగుతుంది. వృత్తి పరంగా అభివృద్ధి బాగుంటుంది. ముఖ్య విషయాలలో బంధుమిత్రుల సలహా పొందండి. అనుకోని ప్రయాణముంటుంది. ఆర్థిక విషయాలలో జాగ్రత్తపడండి. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

త్వరలోనే ఆర్థిక మార్పులుండవచ్చును. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు అనుకూలత బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం కలదు. శుభకార్యాలలో పాల్గొంటారు. బిడ్డల అభివృద్ధి కొత్త పథకాలు నిర్ణయించుకొంటారు. ఉద్యోగులకు అధికార్లతో సత్సంబంధాలుంటాయి. మీ సూచనలు సలహాల వల్ల సంస్థలలో అభివృద్ధి కలదు. ఆరోగ్యం బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, స్థానమార్పు ప్రయత్నాలు జరుగుతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. దూర దేశ ప్రయాణాలు నిర్ణయం కాగలవు. కుటుంబమునకు రావలసిన బాకీలు లభించడం, కోర్టు కేసులందు అనుకూలత, ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక పరిస్థితి బాగుండి వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభిస్తాయి. ఆదాయం పెరుగుతుంది.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఏ రకమైన ప్రలోభాలకు మెత్తబడవద్దు. బంధువుల రాకపోకలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలపై దృష్టి పెడతారు. కొత్త వ్యాపారాలకు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. మీ పనులు జరగడానికి బంధుమిత్రులు సహాయపడతారు. అనవసర వ్యవహారాలలో కలుగ చేసికొనవద్దు. శుభకార్యాలు ఫలించవచ్చు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పిల్లల చదువులు, వివాహాలపై దృష్టి పెడతారు. దూర ప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. నూతన వస్తువులను సమకూర్చుకొంటారు. అధికారులతో మంచి అనుకూలత ఉంటుంది. చిన్నచిన్న అనారోగ్య బాధలుంటాయి. నిర్మాణాలు, కాంట్రాక్టులు పొందడం సవ్యంగా సాగుతుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. సభలు సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరించగలరు. ఉద్యోగార్థులకు అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగిపోతుంది. బిడ్డల చదువు ఆరోగ్య విషయాలలో శ్రద్ధ పెడతారు. ఇంటికి కొత్త వస్తువులు సమకూరుతాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు.

# చంద్రబాబుకు ప్రత్యక్షమైన శ్రీనివాసుడు

శ్రీను గల్పిక

అది కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసుడు కొలువైన తిరుమల క్షేత్రం. అప్పుడే దేవస్థానం ముందు కుయ్‌కుయ్ మని శబ్దం చేసుకుంటూ కొన్ని కార్లు వచ్చి ఆగాయి. కారుల్లోంచి హైటెక్ రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్, ఈయన కుమారుడు నారా దేవాన్ష్, భువనేశ్వరి, బ్రాహ్మణి, బాలకృష్ణ, వసుంధరా దిగారు. వాళ్ళు దిగగానే ఏబిసిడిఎఫ్ టీవీ ఛానెల్ వాళ్ళు ప్రత్యక్ష ప్రసారం మొదలుపెట్టారు. ఇక్కడ ఆ ఛానెల్ ప్రతినిధి పుకార్ల శ్యామల స్టూడియోలో వున్న వంకమూతి శంకర్ రావుతో... శంకర్ ఇప్పుడే బాబు దిగారు... అని అంది. చంద్రబాబుగారా అని శంకర్‌రావు అడిగాడు. కాదు, శంకర్... ఆ బాబు ఇప్పుడు అవుట్ డేటెడ్... ఈరోజు మన ఫోకస్ అంతా దేవాన్ష్‌బాబు మీదే... ఇప్పుడే బాబు అడుగులు వేస్తున్నాడు... అరే పరుగెడుతున్నాడు. ఇదిగిదిగో కూర్చున్నాడు... మళ్ళీ లేచాడు. తాత చంద్రబాబు వద్దకు పరుగెత్తాడు... ఆయన కాళ్ళను చుట్టేసుకున్నాడు. తాత చెయ్యి పట్టుకుని లాక్కుపోతున్నాడు. అదిగో ఏనుగుల వద్దకు వెళ్ళారు. అవి కాళ్ళెత్తి దేవాన్ష్‌బాబుకు నమస్కరించాయి. తొండంతో దీవించాయి. ఏనుగు తొండం పట్టుకుని దేవాన్ష్‌బాబు ఆడుకుంటున్నాడు... అని శ్యామలా చెప్పుకుంటూ పోతే... ఏదేమైనా శంకర్ ఈరోజు ఒక శుభదినం... దేవాన్ష్‌బాబు అడుగుపెట్టడంతోనే ఇక్కడ వాతావరణం మారిపోయింది. ఎండ తగ్గి చల్లటిగాలులు వీస్తున్నాయి. ఈ బుడ్డోడిని చూస్తుంటే తాతగారిలాగే ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతాడనిపిస్తుంది శంకర్ అని చెప్పింది. వెంటనే స్టూడియో నుండి శంకర్ వుండి... దేవాన్ష్‌బాబు లోకేష్‌బాబు కంటే ముందే సీఎం అవుతారంటారా... లేక ఆయన తర్వాత అవుతారంటారా? అని అడిగాడు. దానికి శ్యామల... దేవాన్ష్ స్పీడు, తన తాత చంద్రబాబు గారి అడుగు జాడల్లో నడవడం చూస్తుంటే లోకేష్ కంటే ముందే సీఎం అవుతాడేమోనని పిస్తుంది శంకర్. మిగతా లైవ్ వాళ్ళు గుడి బయటకు వచ్చాక కంటిన్యూ చేద్దాం, ఇప్పుడే చంద్రబాబు ఫ్యామిలీ గుడి లోపలకు వెళ్ళిపోయింది శంకర్ అని చెప్పి ముగించింది.

చంద్రబాబు గుడిలోకి వెళ్ళి శ్రీవారి ముందు నిలబడ్డాడు. రెండుచేతులు జోడించి పది నిముషాలపాటు కళ్ళు మూసుకుని నిలబడిపోయాడు. తర్వాత అందరితో కలిసి బయటకొచ్చాడు. నిత్యాన్నదాన సత్రంకు వెళ్ళి, దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అందరికీ అన్నం వడ్డించి వారితోపాటు తానూ తిన్నాడు. ఆ తర్వాత పద్మావతి అతిథిగృహంకు వెళ్లాడు. ఆయన తిరుమలలో వున్నాడన్న మాటేగాని మనసంతా అశాంతి... జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ఆందోళన... వాటి గురించి ఆలోచిస్తూనే బెడ్‌మీద నడుం వాల్చాడు.

★★★★★

బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నుండి వచ్చిన లేఖను తీసుకుని మంత్రి దేవినేని ఉమ వచ్చాడు. చంద్రబాబుకు ఆ లేఖను అందించాడు. చంద్రబాబు ఆ లేఖ చదవసాగాడు. కావాలనే మీరు మాతో విడిపోయారు. మీ అవినీతి అక్రమాలు బయటపెడతాం, పోలవరంలో వేలకోట్ల అవినీతి జరిగింది. అవినీతిని సాక్ష్యాధారాలతో సహా ప్రజల ముందు బయటపెడతాం... అని ఆ లెటర్‌లో బెదిరించారు. ఆ లెటర్ చదవగానే చంద్రబాబుకు చిర్రెత్తుకొచ్చింది. కొంచెం మైండ్ డైవర్ట్ అవుతుందని టీవీ ఆన్ చేశాడు. టీవీ ఛానెల్ 10.5లో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రెస్ మీట్... అమరావతి పేరుతో చంద్రబాబు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డాడు. ప్రపంచంలో ఎక్కడకూడా నిర్మాణ ఖర్చు అడుగుకు రెండువేలకు మించదు. చంద్రబాబు మాత్రం అంతర్జాతీయ రాజధాని అంటూ భూమ్మీద ఎక్కడాలేని రేట్లు వేసి రాజధాని భవనాలు కట్టిస్తున్నాడు. చంద్రబాబు అవినీతిని తవ్వి తీయాలంటే గడ్డపారలు చాలవు. బుల్‌డోజర్‌లు, ప్రొక్లెయిన్‌లు కావాలి. ఈ చంద్రబాబుకు ఇక నిద్రలేకుండా చేస్తాం అని ఆవేశంగా హెచ్చరించాడు. చంద్రబాబు మనసులో వీడు బీజేపీలో కాదు, వైసిపిలో ఉండాల్సినోడు అనుకుంటూ ఎక్స్ ఛానెల్ మార్చాడు. అక్కడ పోసాని కృష్ణమురళితో డిబేట్... ఆ ఛానెల్ యాంకర్ రాస్కోరా సాంబ వుండి... మీ సినిమావాళ్ళలో బ్రోకర్లు లేరా... లం... ముండలు లేరా... వాళ్లెందుకు ప్రత్యేక హోదాకు మద్దతునివ్వడం లేదు అని అడిగాడు. దానికి పోసాని... మేము గలీజు నా కొడుకులమే... నువ్వు మీ చంద్రబాబు, మీ లోకేష్‌లు మగ పతివ్రతలు... చంద్రబాబును, లోకేష్‌ను తీసుకురండి, నార్కో ఎనాలసిస్ పరీక్షలు చేయిద్దాం... ఎవరు ఎలాంటి వాళ్ళో బయటపడుతుంది. తప్పులు చేయని వాళ్లెవరో తేలుతుంది అని ఆవేశంగా అన్నాడు. అది చూస్తున్న చంద్రబాబు... వీళ్ళ అభిమానం తగలెయ్యా... వీళ్ళు నా మీద పక్షపాతం చూపుతున్నారా? వీళ్ళ వెర్రి డిబేట్‌లతో నాకు పక్షవాతం వచ్చేలా చేస్తున్నారా అని మనసులో అనుకున్నాడు. అక్కడ టీవీ డిబేట్‌లో పోసాని... వెంటనే ఇక్కడకు చంద్రబాబు, లోకేష్ రావాలి... నార్కో ఎనాలసిస్ పరీక్షలు చేయాలి... అప్పటిదాకా నేను ఇక్కడనుండి కదలను అని కూర్చున్నాడు. యాంకర్ సాంబ... సార్, మేం స్టూడియో మూసి ఇళ్ళకు వెళ్లాలని చెప్పినా పోసాని లేవలేదు. చంద్రబాబు, లోకేష్ వచ్చే వరకు ఇక్కడే కూర్చుంటానని, అవసరమైతే నిరాహారదీక్ష చేస్తానని భీష్మించాడు. అప్పుడు రాస్కోరా సాంబ... సరే మీరు డిమాండ్ చేసినట్లే చంద్రబాబు, లోకేష్‌లను పిలిపిస్తాం, నార్కో ఎనాలసిస్ పరీక్షలు చేయిస్తాం, వారు తప్పు చేయలేదని ఋజువైతే మీరు ఈ రాష్ట్రం వదిలి పోవాలి. సరేనా అని ప్రపోజల్ పెట్టాడు. పోసాని అందుకు అంగీకరించాడు. మీరెవర్రా మాకు టెస్ట్‌లు పెట్టడానికి అంటూ చంద్రబాబు కేకలు వేయసాగాడు. అప్పుడే ఆయన భుజాన్ని ఎవరో ఒడిసిపట్టారు. బాబు... బాబు అంటూ తట్టారు. చంద్రబాబు కళ్ళు తెరిచాడు. ఆశ్చర్యం ఆయన పద్మావతి అతిథి గృహంలో బెడ్‌పైనే వున్నాడు. అప్పటిదాకా జరిగిందంతా కల అని తెలుసుకున్నాడు. మరి తనను తట్టి లేపింది ఎవరు అని ఎదురుగా చూసాడు. ఆశ్చర్యంతో ఆయన కళ్ళు పెద్దవయ్యాయి. అక్కడ నిలువునామాల వాడు ప్రత్యక్షమై వున్నాడు. స్వామీ, ఈ భక్తుడి కోసం మీరే వచ్చారా అంటూ ఆయన కాళ్ళ మీద పడి ఏడుస్తూ... ఏంటి స్వామి నాకు ఈ కష్టాలు, ఓ పక్క కేంద్రం దుమ్మెత్తి పోస్తోంది, ఇంకోపక్క పవన్ కళ్యాణ్... ఇక జగన్‌తో పెద్ద సమస్య వుండనే వుంది. వీటన్నింటికి పరిష్కారం ఏంటి స్వామి అని అడిగాడు. దానికి స్వామి... ఈ కష్టాలన్నీ ఇంకో ఏడాది మాత్రమే నాయనా అని చెప్పాడు. ఆ తర్వాత తొలగి పోతాయా స్వామి అని చంద్రబాబు ఆత్రుతగా అడిగాడు. లేదు నాయనా అవే అలవాటైపోతాయి అని చెప్పి మాయమయ్యాడు. చంద్రబాబు అలానే నోరు తెరిచాడు.

# భగవంతుని పాత్రల్లో నటించడం పూర్వజన్మ సుకృతం



## ఘనంగా సింహపురి సంస్కృతి సమాఖ్య 'ఉగాది' పురస్కారం

### - ప్రముఖ సినీనటుడు సుమన్




ప్రముఖ నటుడు, దాదాపు నాలుగు దశాబ్దాలుగా సినీరంగంలో తనదంటూ విశిష్టమైన నటనాప్రతిభతో అందరి అభిమానాన్ని అందుకుంటున్న సుమన్‌కు నెల్లూరులోని 'సింహపురి సంస్కృతి సమాఖ్య' మార్చి 25న ఉగాది పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించింది. నెల్లూరు పురమందిరంలో ప్రముఖ కళాకారుదు రాంజీ ఆధ్వర్యంలో ఎంతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కళాకారులు, సుమన్ అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ, తనకు నెల్లూరంటే ఎంతో ఇష్టమని, నెల్లూరుతో తనకెంతో కాలం నుంచి ఆత్మీయానుబంధం ఉందని అన్నారు. తన తొలి ఔట్‌డోర్ షూటింగ్ జరిగింది నెల్లూరులోనేనని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా తనకు లభించిన శ్రీరాముడు, శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ సత్యనారాయణ స్వామి వంటి భగవంతుని పాత్రల్లో నటించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. 'అన్నమయ్య' చిత్రంలో తాను శ్రీ వేంకటేశ్వరస్వామిగా నటించిన పాత్ర అందరి అభిమానాన్ని చూరగొనిందని, అప్పటి ఉపరాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ కూడా ఆ పాత్రను ఎంతో మెచ్చుకుని తనను అభినందించడం తన జీవితంలో ఓ మరపురాని సంఘటన అని సుమన్ అన్నారు.

ఈ సందర్భంగా రాంజీతో పాటు, ముఖ్యఅతిథులు వివిఎస్‌యు వైస్‌ఛాన్సలర్ వీరయ్య, 'నుడా' ఉపాధ్యక్షులు ఢిల్లీరావు, నగర డిఎస్పీ మురళీకృష్ణ, సెట్నల్ సిఇఓ సుబ్రహ్మణ్యం పాల్గొని సుమన్‌కు ఘనంగా ఉగాది పురస్కారాన్ని అందజేశారు.

### విశిష్టసేవలకు ఉగాది పురస్కారాలు

ఉగాదిని పురస్కరించుకుని ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. గురుకృప నృత్యసంస్థ అధినేత్రి సురభి గాయత్రి, నాట్యతార కల్పన, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్య నాయుడు, సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, జొన్నవాడ దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్ సుబ్రహ్మణ్యం నాయుడు, పండరి భజన కళాకారుడు కృష్ణదాసు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆచారి, ప్రముఖ కవి పల్లాప్రోలు రాము, ఏసి టెక్స్‌టైల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తన్నీరు మాల్యాద్రి తదితరులు ఆయా రంగాల్లో చేస్తున్న విశిష్టసేవలకు గుర్తింపుగా వారికి ఉగాది పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు.



## నాణ్యతకు కేరాఫ్ అడ్రస్ ఎన్టీఆర్ ఇళ్ళు

### - నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య



పేదలకు ఆధునిక నివాసాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'హౌస్‌ఫర్ ఆల్' కార్యక్రమంలో నిర్మిస్తున్న ఇళ్ళు నాణ్యతకు కేరాఫ్ అడ్రస్ లాంటివని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మార్చి 27వ తేదీన నెల్లూరులో ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరపురం వద్ద నిర్మిస్తున్న ఇళ్ళలో మంత్రి నారాయణ అవినీతికి పాల్పడుతున్నాడంటూ నెల్లూరు ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ మంచి చెడ్డా తెలుసుకోకుండా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో నీడలేని పేదవాడు ఉండకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక వసతులతో 6లక్షల ఇళ్లు కట్టిస్తోంది. మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెంకటేశ్వరపురం వద్ద షేర్‌వాల్ టెక్నాలజీతో ఈ ఇళ్ళను కట్టిస్తున్నారు. భూకంపాలు వచ్చినా తట్టుకోగల టెక్నాలజీని ఈ ఇళ్ళ నిర్మాణానికి ఉపయోగిస్తున్నారు. ఈ గృహ సముదాయాలను ఇతర రాష్ట్రాల వాళ్ళు వచ్చి చూసిపోతూ, ఈ టెక్నాలజీతోనే తమ రాష్ట్రాలలో ఇళ్ళు కడతామంటున్నారు. నెల్లూరు నగరాభివృద్ధి కోసం వందలకోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. ఇంతగా కష్టపడుతున్న మంత్రి నారాయణపై నిందారోపణలు చేయడం మానుకోవాలని ఆయన అనిల్‌కు హితబోధ చేశారు. హౌస్ ఫర్ ఆల్ ఇళ్ళపై చేస్తున్న అవినీతి ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ధర్మవరం సుబ్బారావు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సవాల్‌కు... సై

### - చర్చకు సిద్ధమన్న వైఎస్సార్‌సిపి నాయకులు



నెల్లూరులోని జనార్దన్‌రెడ్డి కాలనీలో 'హౌస్ ఫర్ ఆల్' ఇళ్ళలోని అవినీతిని నిరూపించడానికి తాము బహిరంగ చర్చకు సిద్ధమని, ఆ చర్చ ఎక్కడ పెట్టినా అందుకు తమ ఎమ్మెల్యే డా. అనిల్ సిద్ధంగా ఉన్నారని, 'నుడా' ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విసిరిన సవాళ్ళకు తాము సిద్ధమని కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ అన్నారు. మార్చి 28న నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రూప్ మాట్లాడుతూ, షేర్‌వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఇళ్ళలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని ఎమ్మెల్యే అనిల్ ఆరోపించారని ఆయన అంటూ, ఈ విషయమై ఏప్రిల్ 5న చర్చకు రావాలని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సవాల్ విసిరారని, ఆ అవినీతిని నిరూపించేందుకు నుడా ఛైర్మెన్ ఎక్కడ చెబితే అక్కడ లోకల్ ఛానల్‌లో లైవ్ కార్యక్రమం ఇచ్చి మీడియా ముందు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే అనిల్, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, మరో 10మంది నాయకులం వస్తామని, మీ వైపు నుంచి మంత్రి నారాయణ హాజరు కావాలన్నారు. ఎమ్మెల్యే అనిల్ 'హౌస్ ఫర్ ఆల్‌లో దోపిడీ జరుగుతోందన్న మాటలకు కట్టుబడి ఉన్నామని, అవినీతి నిరూపించలేకపోతే మంత్రి నారాయణకు క్షమాపణ చెప్పి సన్మానం చేస్తామన్నారు. అవినీతిపై మాట్లాడితే కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఇళ్ళ నాణ్యత గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఎం.డి ఖలీల్‌అహ్మద్, నాయకులు వందవాశి రంగా, దార్ల వెంకటేశ్వర్లు, హంజాహుస్సేని తదితరులు పాల్గొన్నారు.

## నిఘా కన్నుల్లోకి నగరం!



నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ ఎంచుకున్న ఒక ప్రధాన మార్గం సి.సి కెమెరాల ఏర్పాటు. విశాల్‌గున్నీ ఎస్పీగా ఉన్నప్పుడు నగరంలో కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ట్రంకురోడ్డు, మినీబైపాస్‌రోడ్డులలో సి.సి. కెమెరాలను ఏర్పాటు చేసి జిల్లా పోలీసు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానించారు. ఇంతవరకు నగరంలో వివిధ వ్యాపారసంస్థల సహకారంతో 86 కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే కృష్ణపట్నం పోర్టు సెజ్ పరిధిలోని కొన్ని పరిశ్రమలకు కూడా సి.సి కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులే పర్యవేక్షిస్తున్నారు. కాగా, నగరంలో మరో 325 సి.సి కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. నేరాల కట్టడితో పాటు ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈ సి.సి కెమెరాలను పోలీసులు ఉపయోగించుకోనున్నారు.

## సాయిదర్బార్‌లో నవమి వేడుకలు

నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో శ్రీరామ నవమి వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. నవమి రోజున శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా 12గంటలపాటు అఖండ సాయినామ సంకీర్తన నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి పూలరథంపై సాయినాధునికి కన్నుల పండువగా నగరోత్సవం నిర్వహించారు. జెండా ఉత్సవం, గంధమహోత్సవం వైభవంగా జరిగాయి. మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో, శ్రీ సాయిదర్బార్ ట్రస్ట్, సత్సంగ్ సేవాదళ్ సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



## బాలుని వైద్యానికి సాయం

నెల్లూరు గ్రామీణ మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఉదయ్‌కార్తీక్ క్యాన్సర్ వ్యాధికి గురికాగా, ఆ బాలుని వైద్యానికి వద్దెర ఉద్యోగుల సంక్షేమ సంఘం రెండు లక్షల రూపాయలను ఆ బాలునికి వితరణగా అందించింది. నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 25న జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు ఆ బాలుని కుటుంబసభ్యులకు ఆ నగదును అందజేశారు.

# రెడ్‌క్రాస్ సబ్‌కమిటీలను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఏఎండి ఇంతియాజ్

రెడ్‌క్రాస్ సబ్‌కమిటీలను నియమించాలని జేసి ఏఎండి ఇంతియాజ్ సూచించారు. కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో మార్చి 28న జరిగిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ మరియు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడారు. అజెండాలోని పలు అంశాలపై చర్చించారు. స్పాస్టిక్ సెంటర్, రెడ్‌క్రాస్ కార్యాలయం, గాంధీ ఆశ్రమం, జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ నిర్వహణకు నిధులు సమకూర్చాలని సూచించారు. సబ్‌ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న సిబ్బంది వేతనాల పెంపుకు చర్యలు చేపట్టాలన్నారు. మూసివేసిన నేచురోపతి ఆసుపత్రి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. గాంధీ ఆశ్రమంలో వృద్ధాశ్రమం నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డా. ఏ.వి సుబ్రహ్మణ్యం, వైస్ ఛైర్మెన్ ఎల్వి నరసారెడ్డి, కార్యదర్శి పి.మస్తానయ్య, కోశాధికారి మోహన్‌లాల్‌జైన్, కన్వీనర్లు డా.కె.సుబ్బారావు, బి.మనోహర్‌రెడ్డి, గణేశం కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పది ముగిసింది



మార్చి 27వ తేదీతో పదో తరగతి పరీక్షలు ముగిసాయి. జిల్లాలో 169 పరీక్షా కేంద్రాలలో 33,100 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసారు. ఎలాంటి ప్రశ్నా పత్రాల లీకులు లేకుండానే పరీక్షలు అయిపోవడంతో విద్యాశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత ఏడాది జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ఈసారి పది పరీక్షలను పకడ్బందీగానే నిర్వహించారు. ముఖ్యంగా ఇన్విజిలేటర్లకు పరీక్షా కేంద్రాలను కేటాయించడంలో పలు మార్పులు చేసారు. దీనికితోడు పేపర్ లీకైనా, విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డా ఇన్విజిలేటర్ల మీద కఠిన చర్యలుంటాయనే హెచ్చరికల నేపథ్యంలో వాళ్ళు ఎలాంటి లోపాలకు తావివ్వకుండా తమ విధులు నిర్వహించారు. 27వ తేదీ చివరి పేపర్ వ్రాసి బయటకురాగానే విద్యార్థులు తమ తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి హోటళ్ళు, సినిమాహాళ్ళు, ఐస్‌క్రీం పార్లర్‌లకు సంతోషంగా పరుగులు తీసారు.

# ఆలయాల హుండీ లెక్కింపు

నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాథస్వామి దేవాలయం హుండీని బుధవారం లెక్కించగా, గత నెల 23 నుంచి మార్చి 23వ తేది వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం 5,89,709రూపాయలు ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ ఛైర్మెన్ మంచికంటి సుధాకరరావు, ఇ.ఓ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా సింహపురి గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం హుండీని లెక్కించగా, గత ఏడాది నవంబరు నుంచి ఈ నెల 28వ తేది వరకు మొత్తం 6.76 లక్షల రూపాయలు ఆదాయం వచ్చిందని ఆలయ ఇ.ఓ వేమూరి గోపి తెలియజేశారు.

## బిపిటి ధాన్యానికి
# పెరిగిన మద్దతు ధర
## పుట్టికి రూ.1785 పెంపు

బిపిటి జిలకర ధాన్యం రకానికి ప్రభుత్వం మద్దతు ధరను పెంచింది. ఇప్పటిదాకా క్వింటాల్‌కు 1,590 రూపాయలుగా ఉన్న ధరను 1800 రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో ఆమేరకు నిర్ణయం తీసుకున్నారన్నారు. జిల్లాలో ఎన్ఎల్ఆర్-34449 రకంతో పాటు బిపిటి రకం సాగు కూడా అధికంగా జరిగిందన్నారు. బిపిటి రకాన్ని ప్రభుత్వం ఏ-గ్రేడ్‌గా నిర్ణయించడంతో పుట్టికి మద్దతుధర 13,515 రూపాయలుగా ఉండన్నారు. అయితే ఆ ధర చాలదని రైతులు, రైతు సంఘాల ఆందోళనతో ప్రభుత్వం దీనిపై పున:సమీక్షించి ధరను పెంచిందని, ప్రస్తుతం మద్దతు ధర ప్రకారం పుట్టించి 1785 రూపాయలు పెరిగిందని తెలిపారు. ఈ లెక్కన బిపిటి పుట్టి 14,220 రూపాయలుగా మద్దతు ధర లభిస్తుందన్నారు.

# హోదా ఉద్యమం.. హైజాక్‌కు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ప్రత్యేకహోదా ఉద్యమం బాగా రగులుకుంది. ప్రజల్లో చైతన్యం మొచ్చింది. అన్ని రాజకీయ పక్షాలు కూడా హోదా కోసం గళమెత్తాయి. రాష్ట్ర రాజకీయాలలో ప్రత్యేకహోదాపై మొదటి నుండి గట్టిగా నిలబడింది, గట్టిగా పట్టుబట్టింది వై.యస్. జగన్మోహన్‌రెడ్డి. ప్రత్యేకహోదా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజల మద్దతుతో ముందుకు నడిపాడు.

ప్రత్యేకహోదా కోసం గట్టిగా పోరాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. కేంద్రం ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని ప్రత్యేకప్యాకేజీ మాత్రమే ఇస్తామన్నప్పుడు అదే మహాప్రసాదం అన్నట్లుగా అంగీకరించిందేగాని హోదా ఎందుకు ఇవ్వరని ఏ రోజూ అడగలేదు.

ఈరోజు బీజేపీతో విభేదాలొచ్చేసరికి, ప్రతిపక్షం హోదా ఉద్యమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళేసరికి ఉలికిపాటు మొదలైంది. ప్రత్యేకహోదా ఉద్యమాన్ని హైజాక్ చేసే ఎత్తుగడలకు శ్రీకారం చుట్టింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఏనాడూ అఖిలపక్ష సమావేశం జరపలేదు. అమరావతిని రాజధానిగా నిర్ణయించేటప్పుడు తెలుగుదేశంకు అఖిలపక్షాలు గుర్తుకురాలేదు. రాజధాని అన్నది తెలుగుదేశం రియల్‌ఎస్టేట్ వ్యాపారం కాదు. 13జిల్లాల ప్రజలకు సంబంధించిన అంశం. భావితరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించాల్సిన విషయం. ఆరోజు ఏ పక్షాన్ని పిలవకుండానే ఏకపక్షంగా అమరావతిని రాజధానిగా నిర్ణయించేసారు. ఆ తర్వాత నాలుగేళ్ళలో ఏ అంశంపైన కూడా ప్రతిపక్షాన్ని పిలిచి అడగాలన్న స్పృహ ఈ ప్రభుత్వానికి తట్టలేదు. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని ప్రభుత్వమే నాలుగేళ్ళుగా తొక్కి పట్టాలని చూసినా ప్రధాన ప్రతిపక్షం వైసిపి, ఇక వామపక్షాలు ఏదో రూపంలో ముందుకు తీసుకుపోతూనే వున్నాయి. ప్రత్యేకహోదా ఉద్యమం పరిపక్వ దశకు వచ్చిందని, హోదాకు జైకొట్టకపోతే ఆంధ్రా జనం తమను ఛీకొట్టడం ఖాయమని భావించిన చంద్రబాబు 'యూ' టర్న్ తీసుకున్నాడు. ఉద్యమాన్ని పూర్తిగా హైజాక్ చేసి పచ్చముద్ర వేసుకునేందుకు అఖిలపక్షం నాటకం మొదలుపెట్టాడు. ఈ అఖిలపక్షం సమావేశంకు ప్రధాన ప్రతిపక్షం వైసిపితో పాటు బీజేపీ, జనసేన వంటి పార్టీలు హాజరు కాలేదు. వామపక్ష నాయకులు వెళ్ళినా ఈ నాలుగేళ్ళు ఎక్కడ నిద్రపోతున్నారంటూ చంద్రబాబు ముఖాన్నే కడిగేసి బయటకొచ్చారు.

హోదా అంటే జైలుకే అని బెదిరించిన నాయకులే ఆ ఉద్యమానికి సారథ్యం వహిస్తామని చెప్పడం చూస్తుంటే గొర్రెల మందకు తోడేళ్లను కాపలా పెట్టడమే అవుతుంది. ఇలాంటి నాయకుల చేతుల్లోకి ఉద్యమం పోతే చివరకు అది ఏ దారి పడుతుందో తెలియదు. చంద్రబాబు హోదా ఉద్యమ హైజాక్ ప్లాన్‌కు ప్రతిపక్షాలు బలంగానే బ్రేక్ చేశాయి.




# మందు బంద్

వ్యాపారులు బంద్ చేయడం చూసాం... విద్యార్థులు బంద్ చేయడం చూసాం... ఉద్యోగులు బంద్ చేయడం చూసాం... ఆఖరకు పెట్రోల్ బంకుల వాళ్ళు, మందుల షాపుల వాళ్ళు కూడా బంద్ చేయడం చూసాం. కాని, మద్యం వ్యాపారులు బంద్ చేయడం ఎప్పుడన్నా చూసామా? చంద్రబాబు పుణ్యాన ఆయన హయాంలో అది కూడా జరిగిపోయింది. జిల్లాలోని మద్యం వ్యాపారులు 27వ తేదీ నుండి బంద్‌ను పాటిస్తూ వైన్‌షాపులను మూసేసారు. మద్యం వ్యాపారుల బంద్‌తో జిల్లా వ్యాప్తంగా వున్న 349వైన్‌షాపులు, 46బార్లు మూతపడ్డాయి. దీంతో సరాసరి రోజూ 2.50కోట్ల దాకా జరిగే మద్యం వ్యాపారం ఆగిపోయింది. మద్యంషాపుల మూతతో మందుబాబులు చాలా ఇబ్బందులు పడ్డారు. రోజూ తాగే అలవాటున్నవాళ్ళు తెలిసిన వాళ్ళను బాటిళ్ళను అడుక్కోసాగారు. నెల్లూరు డి.ఆర్, మినర్వ హోటళ్లలో మాత్రమే బార్లు నడుస్తుండడంతో అవి కిక్కిరిసిపోయాయి. మద్యం వ్యాపారులు తమ మార్జిన్ మనీని పెంచాలని కోరుతూ బంద్‌కు దిగారు. గతంలో అమ్మకాల మీద 18శాతం మార్జిన్ ఉండేది. అయితే అప్పుడు వేలంపాటల ద్వారా ఎవరు ఎక్కువకు పాడితే వాళ్ళకు మద్యం దుకాణాలు కేటాయించేవాళ్ళు. కాని గత ఏడాది వేలం పాటలకు బదులు లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయించారు. ఏరియా వారీగా లైసెన్స్ల ఫీజులను తగ్గించారు. అప్పుడు గెజిట్‌లో మద్యం వ్యాపారులకు మార్జిన్ ఎంత అన్నది స్పష్టం చేయలేదు. లాటరీ ద్వారా షాపులన్నీ కేటాయించాక అమ్మకాలపై 18శాతం వున్న మార్జిన్ మనీని 7శాతంకు తగ్గించారు. దీంతో మద్యం వ్యాపారుల గుండెల్లో రాయిపడింది. తక్కువ లైసెన్స్ ఫీజుతో లాటరీలో వైన్‌షాపును కొట్టేసామన్న ఆనందం వారిలో ఎక్కువకాలం నిలబడలేదు. మార్జిన్ మనీ తగ్గించడం, ఎంఆర్‌పి ధరలకే మద్యాన్ని విక్రయించాలని గట్టిగా చెప్పడం, బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపడం, బిల్లింగ్ మిషన్‌లు పెట్టడం, ప్రతి నెలా ఆయా శాఖల వారి మామూళ్ళు వంటి వాటితో మద్యం వ్యాపారులకు ఈ వ్యాపారమే పెద్ద గుదిబండగా మారింది. మద్యం తాగేవాళ్ళకన్నా కూడా మద్యం వ్యాపారం చేస్తూ ఆర్థికంగా తాము చితికిపోతున్నామనే ఆవేదనలో మద్యం వ్యాపారులు బంద్‌కు దిగారు.

# కలవర పెట్టిన కరచాలనం

(మొదటి పేజీ తరువాయి)

నమస్కారం పెట్టినందుకే ఇంత రాద్ధాంతమా? ప్రధానికి దేశంలో ఇంకెవరూ నమస్కారాలు పెట్టరా? ఆయనకు తెలుగుదేశం నాయకులు పెట్టేది మాత్రమే నమస్కారమా? వైకాపా నాయకులు పెడితే తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టడమా?

పార్లమెంటు సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న సంఘటన రాష్ట్ర రాజకీయాల్లో వివాదాస్పదమైంది. పార్లమెంటులో వున్న ప్రధానికి ఎంపీలందరూ అభివాదం చేస్తున్నారు. ఎవరు ఏ పార్టీ వారైనా ప్రధాని స్థాయి నాయకుడికి అభివాదం చేయడం, ఆయన ప్రతి నమస్కారం చేయడం భారతీయ సంస్కారంలో భాగం. ఏ తల మాసినోడు కూడా ఈ సంస్కారాన్ని తప్పుపట్టడు. కాని పార్లమెంటులో ప్రధాని నరేంద్రమోడీని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి నమస్కరించడాన్ని తెలుగుదేశం నాయకులు పెద్ద రచ్చ చేసారు. ప్రధాని కాళ్ళకు ఆయన పాదాభివందనం చేసాడని, తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టాడని ప్రచారం గుప్పించారు. పచ్చమీడియా సంగతి ఇక చెప్పనవసరం లేదు. ప్రధానికి విజయసాయిరెడ్డి పాదాభివందనం చేసాడా లేదా అనే విషయం పక్కన పెడదాం! ఒక వేళ పాదాభివందనం చేసినా అది తప్పవుతుందా? వయసులో తనకన్నా పెద్దవారికి పాదాభివందనం చేయడం మన సంస్కృతిలో తప్పెలా అవుతుంది. మరి ఇన్నేళ్ళ రాజకీయ చరిత్రలో తెలుగుదేశం నాయకులు ఎవరికీ పాదాభివందనాలు చేయలేదా? గతంలో వాజ్‌పేయి ప్రధానిగా వున్నప్పుడు అనేక సభలలో 'క్యా'కట్టి ఆయనకు పాదాభివందనం చేసిన సంగతిని తెలుగుదేశం నాయకులు మరిచారా? ఒక వాజ్‌పేయి ఏంటి, ఎంతో మంది సీనియర్ నాయకుల కాళ్ళు వీళ్ళు పట్టుకోలేదా? పెద్దలకు పాదాభివందనం చేయడం తప్పు కాదు. కాళ్ళు పట్టుకున్నట్లు నటిస్తూ వాటిని లాగడమే తప్పు. తెలుగుదేశం నాయకుల మాదిరిగా విజయసాయిరెడ్డి ఆ పని చేయలేదు.

కేసుల నుండి విముక్తి కావడం కోసమే విజయసాయిరెడ్డి ప్రధాని కాళ్ళు పట్టుకున్నాడని గోల చేస్తున్నారు. అంటే వీళ్ళ మాటలు భారత న్యాయవ్యవస్థనే కించపరిచే విధంగా వున్నాయి. మరి ప్రధాని మోడీ కాళ్ళు పట్టుకోబట్టే 'ఓటు-నోటు' కేసులో చంద్రబాబు ఇంకా జైలుకు పోకుండా వున్నాడా? ఆయన కాళ్ళు పట్టుకునే తనపై వున్న అన్ని కేసుల్లో స్టేలు తెచ్చుకున్నాడా? ఆయన కాళ్ళకు మొక్కే సుజనాచౌదరి బ్యాంకులను ముంచిన కేసుల నుండి తప్పించుకు తిరుగుతున్నాడా? ప్రధాని కాళ్ళు పట్టుకోబట్టే తెలుగుదేశం ఎమ్మెల్యేలు కొందరు రాష్ట్రంలో ఎన్ని దౌర్జన్యాలు చేసినా, ఎంతగా అక్రమాలకు పాల్పడుతున్నా కేసులు నమోదు కావడం లేదా? నరేంద్ర మోడీ ఈ దేశ ప్రధానా? లేక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తా? కాళ్ళు పట్టుకుంటే కేసులు మాఫీ అయ్యేపనైతే ఎవ్వరూ కోర్టు మెట్లెక్కబోరు... మోడీ కాళ్ళకు మొక్కితే చాలు. సిగ్గు, సంస్కారం వున్న వాళ్లెవరూ భారత ప్రధానికి ఒక వ్యక్తి నమస్కరించడాన్ని రాజకీయం చేయరు? రచ్చ చేయరు? ప్రధాని కాళ్ళకు వాళ్ళు మొక్కితే సంస్కారం, ఇంకొకరు నమస్కరిస్తే అపచారం అన్నట్లుంది ఈ పచ్చ నేతల వ్యవహారం.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com